

నల్లగట్టు పైకి ఏర్పాటు చేస్తున్న ర్యాంపును పరిశీలిస్తున్న తహసీల్దార్ సుబ్బారావు

నల్లగట్టు భూ ఆక్రమణను పరిశీలించిన తహసీల్దార్

నూజివీడు టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం రావిచర్ల నల్లగట్టు ఆక్రమణల పర్వంపై 'ఆంధ్రజ్యోతి'లో 'దర్జాగా భూ ఆక్రమణ' శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఈ మేరకు నూజివీడు తహసీల్దార్ సుబ్బారావు సోమవారం గ్రామంలోని నల్లగట్టు ప్రాంతంలో అక్రమంగా తవ్విన ర్యాంప్‌ను పరిశీలించారు. వారం రోజు లుగా కొందరు అధికార, ప్రతిపక్ష నాయకులు కలిసి నల్లగట్టును ఆక్రమించేందుకు ప్రయత్నిస్తూ ఎక్స్‌కవేటర్‌తో ర్యాంపును నిర్మిస్తున్న నేపథ్యంలో గ్రామస్థులు అడ్డుకుని సమాచారాన్ని రెవెన్యూ అధికారులకు చేరవేసిన విషయం విదితమే. ఈ మేరకు తహసీల్దార్ నల్లగట్టు ప్రాంతాన్ని పరిశీలించారు. సర్వేచేసి పూర్తి నివేదికను ఇవ్వాలని సర్వేయర్‌ను ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రంగుమారిన ధాన్యం రాశుల పరిశీలన

ముదినేపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలో రోడ్ల వెంబడి ఆరబెట్టిన ధాన్యాన్ని వ్యవసాయ శాఖ సిబ్బంది పరిశీలించారు. 'రంగు మారుతున్న ధాన్యం' అనే శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు స్పందించిన జేసీ ధాత్రిరెడ్డి ధాన్యం నిల్వలపై వ్యవసాయ శాఖ జిల్లా అధికారులను ఆరా తీశారు. దీంతో వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ బాషా మండల వ్యవసాయాధికారి వేణు మాధవ్‌ను ఈ విషయమై నివేదిక పంపాలని ఆదేశించారు. ఏవో ఆధ్వర్యంలో కోడూరు గ్రామ సచివాలయ ఏఏవో సౌందర్య ఆ ప్రాంతంలో ఉన్న ధాన్యం రాశులను పరిశీలించారు. వరి కోత పూర్తి కాగానే ధాన్యాన్ని ఆరబెట్టకపోవడం వల్ల ధాన్యం కొద్దిగా రంగు మారినట్టు గుర్తించారు. పూర్తి స్థాయిలో ఆరబెట్టి అమ్మాలని అత్తివాని చెరువు రైతులకు ఏవో సూచించారు. మరోవైపు ముదినేపల్లి మండలంలో రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యంలో 35 మెట్రిక్ టన్నుల రంగు మారిన ధాన్యం ఉన్నట్టు జిల్లా పౌర సరఫరాల శాఖ సంస్థ మేనేజర్ విశ్రీలక్ష్మి తెలిపారు.



ముదినేపల్లి ప్రాంతంలో రోడ్ల వెంబడి ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఏవో, సిబ్బంది

గండం గట్టెక్కేనా!



కృష్ణా కాల్వ దుస్థితి

ఏటా నిర్వహించాలనుకుంటున్న డెల్టా ఆధునికీకరణ పనులు గడిచిన ఐదేళ్ళల్లో అంతా తూచ్. ఎక్కడా తట్ట మట్టి తీసిన పాపాన పోలేదు. రైతుల గోస వింటే ఒట్టు. అంతలా మాయ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి వైసీపీ ప్రభుత్వం మాదిరిగానే చూసీచూడనట్టుగా వ్యవహరిస్తుందా.. లేకుంటే కాల్వల ఆధునికీకరణ పనుల మీద దృష్టి పెట్టబోతున్నారా..? అన్న దానిపై నిర్దిష్ట ప్రణాళిక లేకుండా పోయింది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా మేల్కొనాలన్న తాపత్రయం అటు అధికార యంత్రాంగంలో, ఇటు ఎమ్మెల్యేల్లోను కొంత కొరవడింది. ఇదే జరిగితే అటు సాగునీరు, ఇటు తాగునీరు గండం ఈసారి గట్టెక్కుతుందా అనేది అనుమానమే.

రబీలో సాగునీటికి కటకట తప్పదా..

- ఈ సీజన్‌లో గోదావరి నీటి లభ్యత 23 టీఎంసీల కొరత
- ఇంకోవైపు కాల్వల ఆధునికీకరణకు కార్యాచరణ లేదు
- నిర్దిష్ట పనులపైనా ఎవరికీ పట్టలేదు
- తాగునీటికి ముందుంది గండమే
- ఇప్పటికే జల్ జీవన్ మిషన్ పడకేసింది
- పక్కా వేసవి ప్రణాళికకు సన్నాహాలు లేవు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కూటమి ప్రభుత్వానికి వచ్చే వేసవి అగ్ని పరీక్షే. ముందస్తు కార్యాచరణతో మేల్కొంటే తప్ప గండం గట్టెక్కడం కష్టమే. ఇప్పటికే చలికాలంలోనే ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా నమోదవుతుండగా అదే వచ్చే వేసవిలో ఇంకెలా ఉండబోతున్నాయనే అంచనాలు లేకపోలేదు. ప్రతీసారి రబీని దృష్టిలో పెట్టుకుని సాగునీటి సరఫరా, వచ్చే ఖరీఫ్‌ను దృష్టిలో పెట్టుకుని కాల్వల ఆధునికీకరణ పనులకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తారు. ఏటా ఇదే నెలలో జరిగే సాగునీటి సలహా మండలి సమావేశంలోను నిర్దిష్ట పనులు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తారు. రైతుల నుంచి సూచనలు స్వీకరించి ఆ దిశగా ముందడుగు వేస్తారు. ఈ మధ్యనే సాగునీటి సలహా మండలి సమావేశం అరకొరగా సాగింది. వచ్చే రబీలో సాగునీటికి ఎదురయ్యే అడ్డంకులను, అవాంతరాలను ఎలా పరిష్కరించవచ్చో నిర్దిష్ట సలహాలను ఇవ్వలేకపోయారు. అధికారులు సైతం ముందస్తు నివేదికలతో హాజరు కాలేకపోయారు. ప్రత్యేకించి జిల్లాలోని రైతులు ఆశించినట్టుగా కొన్ని పనులపైనా నామ మాత్రపు చర్యలకైనా ప్రణాళిక రూపొందించలేకపోయారు.

వ్యవసాయ ఆధారిత జిల్లాలో గడిచిన ఐదేళ్ళు ముందుచూపు కొరవడడంతో కాల్వల కింద రైతులు కొంతమేర నష్టపోయారు. రెండో పంటకు తగినంత సాగునీరు లభించక, శివారు భూములకు నీరందక తంటాలు పడ్డారు. గతేడాది ఎదురైన అనుభవాల నుంచి ఈసారి కూడా గుణపాఠం నేర్చుకున్నట్టుగా కనిపించడమేలేదు. వాస్తవానికి ఏటా ఇదే నెలలో కాల్వల ఆధునికీకరణ పనులు ఏవేమి చేయాలి, ఎప్పటిలోపు పూర్తి చేయాలో దిశ, నిర్దేశం చేసేవారు. వార్షిక బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించిన నిధులను బట్టి ఆ మేరకు పనులపై పక్కా ప్రణాళిక ఉండేది. డిసెంబరులో నిర్ణయాలు తీసుకుని జనవరి మాసాంతం ఫిబ్రవరి మొదటి వారంకల్లా పనుల టెండర్ల ఖరారుకు స్కెచ్ వేసేవారు. ఆ పరిధిలోనే పనులు సాగాలని షరతు పెట్టేవారు. ఇదంతా 2014-19 మధ్యనే సాధ్యమైంది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ళలో కాల్వల ఆధునికీకరణ పనులను పక్కన పడేసింది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓట్ ఆన్ అకౌంట్‌గా కొంతమేర నిధులు కేటాయించినా ఈ వేసవిలోను ఏపనులు జరగలేదు. రైతులు ఎదుర్కొం టున్న కష్టనష్టాలు గురించి ఆనాటి ఎమ్మెల్యేలు, మంత్రులు సైతం నోరు మెదపలేదు. ఎర్ర కాల్వ ఆధునికీకరణ పనులు పక్కనపడేశారు. కృష్ణకాల్వ నిర్వహణ పనులను చేపట్టకుండా గాలికొదిలేశారు. దీనికి తగ్గట్టుగానే తాగునీటి విషయంలోను ఇదే నిర్లక్ష్యం గతంలో కొన సాగింది. ఏలూరు నగరానికి పంపులచెరువు నుంచి వచ్చిన తాగునీరే ఆధారం. ఈ నీరంతా కృష్ణ కాల్వ ద్వారా పంపుల చెరువుకు చేరు తుంది. అటువంటి ప్రాధాన్యత కలిగిన కాల్వ పూడిక, పిచ్చి మొక్కలతో నిండిపోయినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఫిబ్రవరిలోపు తాగునీటి సరఫరాపై ప్రణాళిక సిద్ధం చేసే వారు. దానికి ముందస్తుగా నియోజకవర్గాల నుంచి గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కొరత లేకుండా తీర్చేందుకు సిద్ధపడేవారు. ఇలాంటి ప్రణాళికకు ఇప్పటివరకు ఎలాంటి సన్నాహాలు లేనేలేవు.

ముందున్నది కష్టకాలమే..

కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి ఆరు నెలలు గడుస్తోంది. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని వచ్చే వేసవి సీజన్‌లో అధిగమించేందుకు యంత్రాంగంలో ఇంకా స్తబ్దత తొలగిపోలేదు. వాస్తవానికి డిసెంబరులో ప్రణాళిక ఆరంభిస్తేనేగాని కాల్వలు తెరిచే జూన్ ఒకటో తేదీకి పనులు పూర్తికావు. టెండర్ల ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే లక్షల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు రాక కాంట్రాక్టర్లు నిరుత్సాహపడి ఉన్న తరుణంలో కొత్త టెండర్లు పిలిచినా ఎంతమంది పాల్గొంటారనేది అనుమానమే. ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని ఆయా వర్గాలను సమాయత్త పర్చాలి. కాని ప్రణాళికే సిద్ధం కాలేదు. ఈ రబీ సీజన్‌లో గోదావరి నీటి లభ్యత 23 టీఎంసీలు మేర తక్కువగా ఉండబోతుందని అంచనా. అంతకంటే మించి మరింత క్షీణ దశకు చేరుకుంటే సీలేరు నుంచి రప్పించే జలాలు ఏ మూలకూ సరిపోవనేది రైతుల వాదన. దీని ప్రభావమే కాల్వల వెంబడి ఉన్న గ్రామాలపైన తాగునీటి ప్రభావం పడుతుంది. ఇప్పటికే ఇంటింటికి కుళాయి పేరిట జల్ జీవన్ మిషన్ అమలు చేయాల్సింది పోయి వైసీపీ ప్రభుత్వం అనుసరించిన నిర్లక్ష్యం జిల్లా ప్రజలకు శాపం కాబోతుంది. ఇంతకు ముందు ప్రతిపాదించిన జల్‌జీవన్ మిషన్ పనులను ఇంకోసారి రివైజ్ చేసేందుకు కేంద్రం సంకల్పించడంతో ఈసారి వేసవిలో దీని అమలుకు ఎలాంటి చర్యలకు దిగబోతున్నారో ఇప్పటికీ సంబంధిత శాఖలు కనీసం సమీక్షించలేకపోయాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.454 కోట్లు మంజూరు కాగా కేవలం రూ.90 కోట్లే ఖర్చు చేశారు. ఏలూరు నగరంతో పాటు గతంలో అనేక గ్రామాలు తాగునీటి ఎద్దడి ఎదుర్కొన్నాయి. ఫిబ్రవరిలోపే నిర్దిష్ట కార్యాచరణ ఆరంభించాల్సింది ఉంది. అయితే ఇప్పటివరకు ఎలాంటి సమస్య రాదన్న ధీమాతోనే యంత్రాంగం ఉన్నట్టుంది. ఎమ్మెల్యేల్లో కొంతమంది సీనియర్లు ఉండగా మరికొందరు జూనియర్లు. ఈ నేపథ్యంలో అధికారులే చొరవ తీసుకుని నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే సమక్షంలో సమీక్షలు చేస్తే కొంతలో కొంత వాస్తవాలు బహిర్గతమై చర్యలకు అవకాశం ఉంది. ఇలాంటి తరుణంలో కాలయాపన లేకుండా కార్యాచరణకు దిగుతారా, లేకుంటే గతంలో మాదిరిగానే గండం ముంచుకొచ్చినా పట్టనట్టుంటారా అనేది అందరి అనుమానం.



హతుడు పర్లయ్య, నిందితుడు శ్రీధర్‌వర్మ (ఫైల్ ఫొటోలు)

పార్శిల్‌లో మృతదేహం ఆచూకీ లభ్యం

- కాళ్ల శివారు గాంధీనగర్‌కు చెందిన పర్లయ్యదిగా గుర్తింపు
- మిస్సింగ్‌కు రెండు రోజుల ముందే చెరువు, తాపీ పనులకు తీసుకువెళ్లిన శ్రీధర్‌వర్మ
- పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు.. కృష్ణా జిల్లాలో పట్టివేత.. కొలిక్కి వస్తున్న కేసు

■ మెయిన్‌లో..



సంక్షామం

- సంక్షేమ హాస్టల్స్‌పై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలి
- వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో అరకొర వసతులు
- శిథిల భవనాలు.. వెలిసిపోయి కళా విహీనంగా గోడలు
- అధ్వానంగా వాష్‌రూమ్స్
- దోమల మోత.. పలుచోట్ల నేలపైనే నిద్ర

6

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం : కలెక్టర్

ఏలూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విభిన్న ప్రతిభావంతుల సమస్యలపై వచ్చిన అర్జీలను సాను కూలంగా పరిష్కరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల నుంచి అర్జీలు స్వీకరించేందుకు వేదిక కిందకు వచ్చి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవా లని అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో సమర్పించిన అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలన్నారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ జయరాజు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

విభిన్న ప్రతిభావంతుల అర్జీల ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజా సమస్యలు పరిష్కార వేదికకు వినతులు ఇచ్చేందుకు వచ్చే అర్జీదారుల సౌకర్యార్థం కలెక్టర్ వెట్రిసెల్వి పలు ఏర్పాట్లు చేశారు. కుర్చీలు, తాగునీటి సౌకర్యం కల్పించారు. అర్జీదారుల సౌకర్యం కోసం పలు సూచనలతో కూడిన బ్యానర్లు ఏర్పాటు చేశారు. పింఛన్ల విషయంపై ప్రత్యేకంగా సేవాకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక రిసెప్షన్, కౌంటర్, అర్జీలు రాసేందుకు సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను డీఆర్వో విశ్వేశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి : ఎస్పీ

ఏలూరు క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ, ముంబై, కోల్‌కత్తా, చెన్నై మహానగరాల నుంచి సీబీఐ, ఈడీ అధికారులమని చెప్పి ఫోన్లు చేసి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని ఇలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని ఏఎస్పీ సూర్యచంద్రరావులతో కలసి ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 47 ఫిర్యాదులను స్వీకరించారు. సైబర్ నేరగాళ్లపై సైబర్ క్రైమ్.జీవోవీ.ఇన్‌కు తక్షణం ఫిర్యాదు చేయా లని సూచించారు. దివ్యాంగుల వద్దకు ఎస్పీ స్వయంగా వెళ్ళి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులకు శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు.





వెల్లమిల్లి రేవు ప్రాంతంలో ఏలూరు కాల్వ గట్టుపై ఉన్న గుడిసెలను తొలగిస్తున్న అధికారులు

ఏలూరు కాల్వ గట్టుపై ఆక్రమణల తొలగింపు

ఉంగుటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు కాల్వ గట్లపై ఉన్న ఆక్రమణలను తొలగించే ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. ఈవోపీఆర్డీ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆక్రమణల తొలగింపులో భాగంగా వెల్లమిల్లి రేవు వద్ద ఉన్న ఆక్రమణలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు.

నాడు అధ్వానంగా..



గుంతలతో అధ్వానంగా ఉన్న ఆర్‌ఆర్‌పేట రోడ్డు (ఫైల్)

వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఒక్క నూతన రోడ్డు వేసిన పాపన పోలేదు. కనీసం రోడ్లు మరమ్మతులు కూడా చేయలేదు. గుంతలు పడిన రోడ్లపైనే ప్రజలు ఐదేళ్ల ప్రయాణించి నరకం చూశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టింది. తొలుత రోడ్ల మరమ్మతులు చేపట్టింది. ఇప్పుడు నూతన రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నగరంలో ఆర్‌ఆర్ పేట చాలా ప్రధానమైంది. ఇదంతా కమర్షియల్ ఏరియా. చుట్టుపక్కల గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది ఈ రోడ్డుపై ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డు గుంతలమయం అవడంతో ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని నూతన రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఎమ్మెల్యే చంటి రోడ్డును ప్రారంభించి రెండురోజుల్లోనే పూర్తి చేశారు.

- ఏలూరు టూటౌన్

నేడు అద్దంలా..



కూటమి ప్రభుత్వం ఇటీవల నిర్మించిన ఆర్‌ఆర్‌పేట రోడ్డు

14 వరకు 'పరీక్షా పే చర్చ' రిజిస్ట్రేషన్లు

ఏలూరు అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్యాలను సాధించడంలో స్ఫూర్తిని, మార్గనిర్దేశం చేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిర్వహించే 'పరీక్షా పే చర్చ-2025' ఎనిమిదో ఎడిషన్‌కు రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని డీఈవో వెంకటలక్ష్మమ్మ, సమగ్రశిక్ష ఏఎంవో రామారావు తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా ప్రధానిని కలవడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు, జీవితంలో రాణించడంలో, వికసిత్ భారత్‌ను నిర్మించడంలో విద్యార్థులకు ఎలా తోడ్పడాలో తెలుసుకునేందుకు ఇది అద్భుత అవకాశమన్నారు. విద్యార్థులు, టీచర్ లాగిన్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు...ఈ నాలుగు విభాగాల ద్వారా పరీక్ష పే చర్చ కార్యక్రమంలో వచ్చే ఏడాది జనవరి 14వరకు ఇన్నోవేటివ్ ఇండియా1 లింక్‌ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవా లన్నారు. హెచ్ఎంలు, టీచర్లు విద్యార్థులు, తల్లిదండ్రులను సంసిద్ధం చేయాలన్నారు.

ఆపన్నులకు సాయపడాలి

- ఇదే క్రిస్మస్ సందేశం : కలెక్టర్
- కలెక్టరేట్‌లో సెమీ క్రిస్మస్



క్యాండిల్ లైట్ సర్వీసులో కలెక్టర్ వెట్రిసెల్వి, తదితరులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తన బాల్యంలో చదువుకున్న క్రిస్టియన్ స్కూలులో బైబిల్ నుంచి ప్రేమ, క్షమాగుణం, దయాతత్వం, శాంతి నేర్చుకున్నానని కలెక్టర్ వెట్రిసెల్వి పేర్కొన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో సోమవారం రాత్రి జిల్లా మైనార్టీస్ సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన హై టీ (సెమీ క్రిస్మస్) కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అవసరంలో వున్న వారికి సాయపడటమే క్రిస్మస్ సందేశమన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించిందన్నారు. క్రిస్మస్ పండుగతో ఇంటింటా శాంతిసౌభాగ్యాలు నెలకొలనాలని ఆకాంక్షించారు. వివిధ పాఠశాలలు, చర్చిల విద్యార్థులు, క్వయర్ టీంలు క్రైస్తవ సంగీత లహరిని నిర్వహించాయి. పిల్లలతో కేక్‌ను కట్ చేయించారు. క్రీస్తు జననాన్ని తెలిపే గీతాలాపన చేశారు. విద్యార్థులకు బహుమతులుగా పరీక్షల అట్టలను కలెక్టర్ అందజేశారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ట్రాన్స్‌కో ఎస్ఈ సాల్మన్‌రాజు, జిల్లా మైనార్టీస్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఈడీ కృపావరం, క్రైస్తవ మత పెద్దలు రెవరెండ్ విలియం బెనిడిక్ట్, బిషప్ జాన్ ఎస్‌డీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం

- గత ఐదేళ్లుగా కూలిన వంతెనలను పట్టించుకోని వైసీపీ సర్కార్
- జనం, వాహనదారుల పాట్లు
- కూటమి ప్రభుత్వం పైనే ఆశలు



కలిదిండిలో లాల్వ డ్రెయిన్‌పై కూలిన వంతెన



కొండంగిలో కూలడానికి సిద్ధంగా ఉన్న వంతెన

కలిదిండి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కూలిన వంతెనల పట్ల నిర్లక్ష్యం వహించడంతో వాహనదారులు పలు అవస్థలు పడుతున్నారు. కలిదిండి - కైకలూరు రహదారి వద్ద లాల్వ డ్రెయిన్‌పై ఉన్న వంతెన పూర్తిగా కూలిపోగా వంతెన పక్కన తూములు అమర్చి తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేశారు. తరచు ట్రాఫిక్ స్తంభించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. నిత్యం వివిధ పనుల నిమిత్తం కలిదిండి నుంచి కైకలూరు వందలాది మంది వెళ్లి వస్తుంటారు. చేపల తవుడు లోడు లారీలు, ధాన్యం లోడు వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. తాత్కాలిక రహదారి ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. లాల్వ డ్రెయిన్‌పై వంతెన పునఃనిర్మించా లని గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో పాలకులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వంతెన కూలి శిథిలాలు లాల్వ డ్రెయిన్‌లో ఉండటంతో వంతెన వద్ద నీటి ప్రవాహానికి అడ్డు పడి వరదలు వచ్చినప్పుడు నీరు వెనక్కి ఎగదన్ని పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయని వాపోతున్నారు.

కొండంగిలో ప్రధాన కాల్వపై ఉన్న వంతెన ఒక పక్క కూలిపోయి ప్రమాదకరంగా మారడంతో దానికి కొద్దిదూరంలో కాల్వలో తూములు అమర్చి తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వంతెన కూలిపోయి ఐదేళ్లు గడిచినా ఇంత వరకు వంతెన పునఃనిర్మాణ పనులు చేపట్టకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నిత్యం పెదలంక, మట్టగుంట, యడవల్లి, కొండంగి, పల్లిపాలెం గ్రామాల ప్రజలు ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం తాత్కాలిక రోడ్డు కూడా గోతులు పడి పాడైపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కలిదిండి లాల్వ డ్రెయిన్‌పై కూలిన వంతెన, కొండంగి ప్రధాన కాల్వపై కూలిన వంతెనను పునః నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారుల వివరణ ఈ విషయమై ఆర్ అండ్‌బీ ఏఈఈలు అరవింద్, భాస్కర్‌లను వివరణ కోరగా, కలిదిండి లాల్వ డ్రెయిన్‌పై వంతెన పునఃనిర్మాణానికి రూ.70 లక్షలతో ప్రతిపాదనలు పంపించామన్నారు. కొండంగి ప్రధాన కాల్వపై వంతెన పునఃనిర్మాణానికి రూ.50 లక్షలు నిధులు మంజూరయ్యాయని టెండర్లు పూర్తి కాగానే నిర్మాణ పనులు చేపడతామన్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన

సంక్షామం

వసతి గృహాల్లో భయం భయంగా పేద విద్యార్థులు


ఇరగవరం కాలనీలో బాలికల బీసీ సంక్షేమ వసతి గృహం

- అరకొర వసతులు
- శిథిల భవనాలు
- వాష్‌రూమ్స్ అధ్వానం
- దోమల మోత
- భోజనానికి ఇబ్బందులు
- స్టడీ అవర్స్ లేవు



తణుకు బీసీ బాలికల వసతిగృహంలో స్తంభానికి ప్రమాద హెచ్చరిక సూచిక

గ్రామాల్లో విద్యా సౌకర్యాలు లేకపోవడం, ఆర్థిక స్థోమత లేని పేదలకు సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు పెద్ద ఊరట. అక్కడ కూడా వారు సమస్యలతో సతమతమైతే..? చదువు సాగించడం ఎలా..? వారి భవిష్యత్ మెరుగుపడేదెలా..? దీనికి బాధ్యత ఎవరిది. సంక్షేమ వసతిగృహాల్లో సౌకర్యాలు, సమస్యలు చూసిన వారి నుంచి ఎదురయ్యే ప్రశ్నలు. విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించడంలో పాలకులు, అధికారులు విఫలం కావడంతో కొన్ని చోట్ల హాస్టల్స్ మూతపడడం విచారకరం. గ్రామాల్లో పేద విద్యార్థులు కొందరు చదువుకు స్వస్తి చెబితే.. మరికొందరి తల్లిదండ్రులు స్థాయికి మించి అప్పుచేసి మరీ పిల్లలను చదువు కోసం ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు వసతి గృహాల్లో పరిస్థితిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

వసతుల లేమి

చింతలపూడి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చింతలపూడిలో సాంఘిక సంక్షేమ హాస్టల్స్ అధ్వానంగా ఉన్నాయి. పట్టణంలోని శెట్టివారిగూడెం రోడ్డులోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో 125 మంది విద్యార్థులున్నారు. బాత్‌రూమ్ సదుపాయాలు సరిగా లేవు. తలుపులు ఊడిపోయి, గోడలకు పెచ్చులూడి అధ్వానంగా ఉన్నాయి. కొన్ని భవనాల్లో స్లాబ్ లీకేజీలు, పైపులైను లీకేజీలు, ప్రహరీ సమస్యలు ఉన్నాయి. హాస్టల్స్‌తోపాటు సంక్షేమ కార్యాలయం కూడా అధ్వానంగా ఉంది. పట్టణంలో బాలికల హాస్టల్‌లో కూడా సరైన సౌకర్యాలు లేవు. శింగగూడెంలో హాస్టల్ ఒకచోట, పాఠశాల మరొకచోట ఉండడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్ దాటాల్సిందే.

చలితో వణకాల్సిందే..

ఇరగవరం: తణుకు పట్టణంలోని సంక్షేమ హాస్టల్ విద్యార్థులు చలి తీవ్రతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వసతి గృహం కిటీకిలు ఎముకలు కొరికే చలితో వణుకుతుంటే దోమలు దాడి చేస్తున్నాయి. తణుకు పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. సుమారు 50 మంది విద్యార్థులు అరకొర సదుపాయాల మధ్య ఇబ్బందులు పడుతున్నారు. మంచాలు లేకపోవడంతో ఇళ్ల నుంచి చాపలు తెచ్చుకుని నిద్రిస్తున్నారు. దాతలు ఇచ్చిన దుప్పట్లతో చలి నుంచి రక్షించుకుంటున్నారు. ఇరగవరం కాలనీ బీసీ బాలికల వసతిగృహంలో సుమారు 28 బాల బాలికలు ఉంటున్నారు. 1988 నాటి భవనం శ్లాబ్‌పై పెచ్చులూడి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. విద్యార్థులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. చలి తీవ్రతను పూరిస్థాయిలో దుప్పట్లు అందజేయడం లేదు. వసతి గృహంలో ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. విష సర్పాలు సంచరిస్తున్నాయని విద్యార్థులు భయపడుతున్నారు.

ఉండిలో విద్యార్థులు లేరు..

ఉండి: స్థానిక బాలికల వసతిగృహంలో విద్యార్థుల సంఖ్య స్వల్పం. ప్రవేశాలు లేకపోవడంతో కేవలం 24 మంది విద్యార్థినులు మాత్రమే ఉన్నారు. హాస్టల్ భవనంలో సుమారు 12గదుల్లో 8గదులు విద్యార్థులకు కేటాయించారు. అయినా ఖాళీగానే వున్నాయి. గతంలో 50 నుంచి 60 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం తగ్గిపోయారు. 3వ తరగతి 5గురు, 4వ తరగతి ఒకరు, 5వ తరగతి ముగ్గురు, 6వ తరగతి 5గురు, 7వ తరగతి 4గురు, 8వ తరగతి 4గురు, 9వ తరగతిలో ముగ్గురు ఉన్నారు. విద్యార్థులకు కొంత వరకు మెరుగైన సౌకర్యాలు ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు లేరు. ఉదయం, సాయంత్రం ఒక గంట పాటు విద్యార్థులకు బోధనకు ట్యూషన్ మాస్టారును నియమిస్తే ప్రవేశాలు పెరుగుతాయని పలువురు చెబుతున్నారు.


మొగల్తూరులో అద్దె భవనంలో హాస్టల్

కింద పడుకోవాల్సిందే!

ఆచంట: మండలంలోని వల్లూరులో మాత్రమే బీసీ బాలికల వసతి గృహం ఉంది. హాస్టల్‌లో మూడు నుంచి 9వ తరగతి విద్యార్థులు 25 మంది మాత్రమే ఉన్నారు. హాస్టల్ వార్డెన్ విద్యార్థులకు స్టడీ క్లాస్‌లు నిర్వహిస్తున్నారు. హాస్టల్‌లో సదుపాయాలున్నా విద్యార్థులకు బెడ్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారు. వాష్‌రూమ్‌కు నీటి సౌకర్యం లేదు. హాస్టల్‌కు వెళ్లడానికి రహదారి లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

సరిపడా గదులు లేవు

ఉంగుటూరు: మండలంలోని హాస్టళ్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. కైకరం బాలుర ప్రత్యేక వసతి గృహం, చేబ్రోలు బాలికల వసతిగృహాల్లో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. కైకరంలో 60 మంది పిల్లలకు సరిపడా గదులు లేవు. మరుగుదొడ్ల నిర్వహణ లేక ఇబ్బందులు పడుతున్నారు. చేబ్రోలు బాలికల వసతి గృహం శ్లాబు లీకవుతోంది. గోడలు పెచ్చులూడుతున్నాయి.

అద్దె భవనాల్లో వసతి

మొగల్తూరు: తీర ప్రాంత మండలంలో వసతి గృహాలు అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ కొనసాగుతున్నాయి. మొగల్తూరు బాలురు, బాలికల వసతి గృహాలు, ముత్యాలపల్లి వసతి గృహం అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. పాతపాడులో సొంత భవనంలో పూర్తి సౌకర్యాలు లేవు. అద్దెకు చెల్లించకపోవడంతో ముత్యాలపల్లి హాస్టల్ తుఫాన్ రక్షిత భవనంలో నిర్వహిస్తున్నారు. మొగల్తూరు బీసీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరడంతో సుమారు 2 దశాబ్దాలుగా అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. బాలికల వసతి గృహం ఐదేళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతోంది.


తణుకు హాస్టల్‌లో నేలపై పడుకున్న విద్యార్థులు

అరుగులపైనే భోజనం

జీలుగుమిల్లి: జీలుగుమిల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 247మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల అరుగులు, ఆవరణలో కూర్చుని భోజనం చేయాల్సిందే. కొందరు విద్యార్థులకు భోజన ప్లేట్‌లు, గ్లాసులు లేకపోవడంతో ఒక ప్లేట్‌లో ఇద్దరు విద్యార్థులు భోజనం చేస్తున్నారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో సరిపడిన గదులు, క్రీడా మైదానం లేదు. విద్యార్థులు ఉతికిన దుస్తులు ప్రహరీ, భవనం గోడపై ఆరబెడుతున్నారు. బాలుర వసతి గృహం వద్ద విద్యార్థులు ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే బట్టలు ఆరేస్తున్నారు. బర్రింకలపాడు ఏపీ గిరిజన గురుకుల పాఠశాల సిబ్బంది స్థానికంగా నివాసం లేకపోవడంతో సకాలంలో విధులకు సకాలంలో హాజరుకావడం లేదని ఆరోపణలు ఉన్నాయి.


జీలుగుమిల్లి ఆశ్రమ బాలుర పాఠశాల ఆవరణలో భోజనం


చింతలపూడి బాలుర సంక్షేమ హాస్టల్‌లో అధ్వాన వాష్‌రూమ్స్


ముదినేపల్లి బీసీ బాలుర వసతిగృహంలో నీరు లేని టాయిలెట్స్


ఉంగుటూరు మండలంలోని కైకరం హాస్టల్‌లో ఊడుతున్న డోర్లు

మూతపడిన వసతి గృహాలు..


ముదినేపల్లిలో మరమ్మతులకు నోచుకోని ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహ భవనం

ముదినేపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి పెట్టడం లేదు. ముదినేపల్లిలో కళాశాల స్థాయి బాలుర, బాలికల వసతిగృహాల భవనాలు శిథిలం కావడం, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో మూతపడ్డాయి. బాలుర వసతి గృహం భవనం మరమ్మతులు చేయాల్సి ఉండగా, వాష్‌రూమ్స్ పనికి రాకుండా పోయాయి. గత ఏడాది విద్యార్థులు చేరకపోవడంతో వసతిగృహాన్ని మూసివేశారు. భవనం మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్ లేదంటూ జాప్యం చేస్తున్నారు. కళాశాల స్థాయి ఎస్సీ బాలికల వసతిగృహం కూడా మూతబడింది. వసతిగృహ భవనం శిథిలం కావడంతో విద్యార్థినులు చేరలేదు. ఈ ఏడాది ఏడుగురు విద్యార్థులు చేరినా వసతి గృహంలో ఉండే వీలులేక ప్రైవేట్ భవనంలో ఉంటున్నారు. పగలు వసతిగృహంలో భోజనం చేసి రాత్రి ప్రైవేట్ భవ నంలో నిద్రించాల్సిన పరిస్థితి. బీసీ బాలుర వసతిగృహం వాష్‌రూమ్స్ మరమ్మతు చేయించాల్సి ఉంది. నీటి సమస్య పరిష్కారం కాలేదు.

పెంటపాడు



పెంటపాడులో మూతపడిన ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహం

పెంటపాడు: సాంఘిక సంక్షేమ వసతి గృహాలు వసతుల లేమితో అల్లాడుతున్నాయి. పురాతన భవనాలు కావడంతో ఎప్పుడు పడిపోతాయో తెలియని స్థితిలో విద్యార్థులు భయపడుతున్నారు. పెంటపాడులో ఎస్సీ బాలురు, ఎస్సీ బాలికలు, పరిమెళ్లలో ఎస్సీ బాలురు మొత్తం మూడు వసతి గృహాలు ఉన్నాయి. పెంటపాడులో బీసీ బాలుర వసతిగృహంలో విద్యార్థులు లేకపోవడంతో మూసేశారు. ప్రస్తుతం 3 వసతి గృహాలలో సరైన వసతులు లేవు. పెంటపాడు బాలికల వసతిగృహం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారడంతో హాస్టల్‌నే మూసేశారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచనతో ప్రాథమిక పాఠశాలలో రెండు గదులు కేటాయించి తాత్కాలికంగా వసతి గృహాన్ని నడిపిస్తు న్నారు. ఎస్సీ బాలుర వసతి గృహం భవనం కూడా శిథిలా వస్థకు చేరి పెచ్చులూడుతోంది. వాష్‌రూం డోర్లు కూడా లేవు. పరిమెళ్ల వసతి గృహంలో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. పనులు పూర్తయితే పెంటపాడు బాలుర వసతి గృహం మరమ్మతులు చేపట్టనున్నట్లు అధికారులు చెబు తున్నారు. భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు చేసినా ప్రయోజనం ఉండదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిల భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించి పేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ప్రజలు కోరుతున్నారు.

వీరవాసరం


వీరవాసరం మండలం అండలూరులో మూతపడిన ఎస్సీ సంక్షేమ బాలుర వసతి గృహం

వీరవాసరం (భీమవరంటౌన్): అండలూరులో నిర్మించిన సాంఘిక సంక్షేమ వసతి గృహం (బాలురు)లో విద్యార్థులు లేకపోవడంతో మూసివేశారు. గత ఏడాది నుంచి ఈ పరిస్థితి ఉందని చెబుతున్నారు. 2013లో ఎస్‌సిఎస్‌పి నిధులు రూ.80 లక్షలతో నిర్మాణానికి 2013 జూన్ 28న అప్పటి ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు శంకుస్థాపన చేశారు. 2016లో నిర్మాణం పూర్తి కావడంతో అదే సంవత్సరం ఏప్రిల్ 22న మరలా ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు వసతిగృహాన్ని ప్రారంభించారు. కొంత కాలం వసతి గృహం కొనసాగినా తర్వాత విద్యార్థులు లేకపోవడంతో మూసివేశారు. ప్రస్తుతం ఖాళీగానే ఉంది.



వినియోగదారుడా..

మేలుకో

- వస్తు, సేవలు పొందడంలో జాగ్రతలు పాటించాలి
- హక్కుల పరిరక్షణకు వినియోగదారుల ఫోరం


ఆకివీడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యాపారుల మార్కెటింగ్ మాయాజాలంలో చిక్కిన వినియోగదారు వస్తు, సేవల లోపం ఎదుర్కొంటాడు. సమీప దుకాణాల నుంచి, ఆన్‌లైన్ వ్యాపారులందరి దృష్టి వినియోగదారుపైనే. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అంతా వినియోగదారుపైన ఆధారపడి ఉందడనం అతిశయోక్తి కాదు. అంతటి కీలకమైన వినియోగదారులకు ఒక రోజు ఉంది. మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

వినియోగదారులకు ఎంతటి ప్రాధాన్యం ఉన్నా వస్తు సేవలు పొందడంలో జాగ్రత్తలు పాటించాలి. బంగారం, వెండి వంటి ముఖ్యమైన వస్తువులు కూడా బిల్లులు లేకుండా అమ్మకాలు సాగుతుంటాయి. పన్నులు ఎగ్గొట్టడానికి వ్యాపారులు వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నం చేస్తారు. వీటన్నింటిని అధిగమించి వినియోగదారు నాణ్యమైన సేవలు పొందవచ్చు. వస్తువుల కొనుగోలులో నాణ్యత, తయారీ, ముడిసరుకు తదితర అంశాలు పరిశీలించాలి. కొనుగోలు చేసిన వస్తువుకు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. గ్యారంటీ, కాలం, కాలపరిమితి తేదీ, లేబుల్ వంటి అంశాలు సరి చూసుకోవాలి. సమస్య తలెత్తినప్పుడు ముందుగా సంబంధిత అధికారి లేదా వ్యాపారికి నోటీసు ఇవ్వాలి. కొనుగోలు చేసిన సరుకు, వస్తువు నాణ్యత పరిశీలన, సేవల్లో లోపాలను గుర్తిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. తప్పుదారి పట్టించే ప్రకటనలపై అప్రమత్తంగా ఉండాలి. సహజ వనరులను కాపాడుకోవడం మనందరి బాధ్యత.

ఫిర్యాదు ఇలా..

- నష్టపోయిన వినియోగదారు వినియోగదారుల సంఘానికి తెలియజేయాలి.
- కొన్న వస్తువు, జిల్లా ఫోరంలో సేవల విలువలు కోరిన నష్టపరిహారంతో కలిపి లక్షల నుంచి కోటిలోపు ఉంటే జిల్లా కమిషనర్‌కు, కోటికి మించితే రాష్ట్ర కమిషనర్, మూడు కోట్లు దాటితే జాతీయ వినియోగదారుల కమిషర్‌నర్‌కు ఫిర్యాదు చేయాలి.
- ఫిర్యాదుదారుడు లక్షలోపు నష్టపరిహారానికి నగదు చెల్లించవలసిన అవసరం లేదు.
- కేసు తొంభై రోజుల్లో పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

ఉద్యమం నీరుగారుతోంది



వినియోగదారుల ఉద్యమం నీరుగారిపోతుంది. ప్రభుత్వ ప్రోత్సాహం, ఆదరణ కరువైంది. రక్షణ చట్టాలున్నా ఉపయోగపడడంలేదు. జిల్లా ఫోరంలు సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలి. అధిక సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఫోరం తీరు అమలుకు కఠిన నిబంధనలు రూపొందిచాలి. కల్తీ, దగా, మోసం, పెరిగిపోతున్న తరుణంలో బలమైన రక్షణ చట్టం చేయాలి.

బొబ్బిలి బంగారయ్య, వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు

సంక్షేమ వసతి గృహాల మరమ్మతులు పూర్తిచేయండి

అధికారులతో పశ్చిమ కలెక్టర్ నాగరాణి సమీక్ష


అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహ భవనాల మరమ్మతులను త్వరితగతిన పూర్తిచేసి విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఛాంబర్‌లో హౌసింగ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులతో సోమవారం వసతి గృహాల మరమ్మతులపై సమీక్షించారు. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలకు రూ1.29 కోట్లు, బీసీ సంక్షేమ వసతి గృహాలకు రూ.15 లక్షల చొప్పున తొలి విడత పరిపాలన ఆమోదం ఇవ్వడం జరిగిందన్నారు. గృహ నిర్మాణ శాఖకు ముందస్తు ఆదేశాలు ఇచ్చి మరమ్మతు పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. వసతి గృహాలలో శ్లాబ్, వాష్‌రూమ్ మరమ్మతులు, డోర్లు, ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్ వర్క్స్, ఆర్వో ప్లాంట్, తదితర పనులను పూర్తి చేయాల్సి ఉంది. సీసీ కెమెరాలు, పరుపులు, ఇన్వర్టర్లు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి దాతల సహకారాన్ని కోరడం జరిగిందని, ఏ వసతి గృహాలకు ఏర్పాటు చేయాల్సి ఉందో నివేదిక అందజేయాలని సంక్షేమ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ హరిహరనాథ్, ఈఈ బి.పిచ్చయ్య, బి.సి సంక్షేమ శాఖ అధికారి జీవీఆర్ కెఎస్ఎస్ గణపతిరావు, ఎస్టీ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి బీవీఎస్‌బి రామాంజనేయరాజు పాల్గొన్నారు.


హారతులందుకుంటున్న ఉత్సవమూర్తులు

విలాస మండపంలో ధనుర్మాస ఉత్సవం

తిరువీధుల్లో తిరుగాడిన శ్రీవారు

ద్వారకాతిరుమల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శేషాచలం కొండపై శ్రీవారి క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. విలాస మండపంలో ఉభయ దేవేరులు, గోదాదేవితో కొలువైన శ్రీవారికి సోమవారం జరిగిన ధనుర్మాస ఉత్సవం భక్తులకు కనువిందు చేసింది. ముందుగా స్వామివారు, ఉభయ దేవేరులు, గోదాదేవితో కలసి క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. అనంతరం గజ, అశ్వ వాహన సేవలతో పాటు మేళతాళాలు, డోలు సన్నాయి వాయిద్యాల నడుమ ఊరేగించారు. తరువాత మండపంలో గోదాదేవితో సహా శ్రీవారి, అమ్మవార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి, హారతులిచ్చి ప్రసాద వితరణ చేశారు.

మంచు ముసుగు


మంచు ముసుగులో ప్రధాన గోపురం


హిమవర్షంలో గజలక్ష్మి మార్నింగ్ వాక్

శ్రీవారు కొలువైన శేషాచలం కొండపై మంచు ముసుగులా పరుచుకుంది. భానుడి లేలేత కిరణాలను పొగమంచు తెరలు కమ్మేశాయి. ఇక మేలుకోవయ్యా శ్రీనివాసా.. అంటూ ఆలయ అర్చకులు స్వామి వారిని మేల్కొలిపి అర్చనలు చేశారు. మంచు పరదాలతో క్షేత్ర పరిసరాలు కనిపించలేదు. శేషాచల కొండపై రహదారులు సైతం సరిగా కనిపించక భక్తులు ఇబ్బందులు పడ్డారు. వాహనాల లైట్ల ఆధారంగా వారు ఆలయానికి చేరుకున్నారు. శ్రీవారి ఆలయ రాజ గోపురాల సముదాయం, ఘాట్ రోడ్డు, శివాలయం, ఇలా శేషాచల ప్రాంతమంతా మంచులో చిక్కుకుంది. మంచుతెరలను చీల్చుకుని భానుడు వచ్చే సుందర దృశ్యాలను వీక్షించిన భక్తులు పరవశించారు. **- ద్వారకాతిరుమల**




అనుగ్రహభాషణం చేస్తున్న జీయర్

ధనుర్మాసం ఎంతో పవిత్రమైనది

రామచంద్ర రామానుజ జీయర్

భీమవరంటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం అతి పవిత్రమైనదని, మోక్ష సాధనకు భగవన్నామ స్మరణ ఒక్కటే శరణ్యమని భీమవరం భాష్యకార సిద్ధాంతి పీఠాధిపతి త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ అన్నారు. వెంకయ్య వీధిలోని పీఠంలో సోమవారం ధనుర్మాస తీర్థ గోష్ఠి నిర్వహించారు. దేవతలకు ఉత్తరాయణం పగలని, దక్షిణాయనం రాత్రి అని వివరించారు. సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. అనంతరం మంది భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. పీఠం సభ్యులు కారుమూరి చినబాబు, చెరుకువాడ రంగసాయి, టి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గోదాదేవిగా అలరించిన చిన్నారి

చిన్న తిరుపతికి సోమవారం గోదాదేవి అలంకరణలో వచ్చిన చిన్నారి శ్రీవారిని దర్శించుకోడం ఆకట్టుకుంది. దాస్యం వరప్రసాద్, మయూరిల కుమార్తె ఖ్యాతి గోదాదేవిగా అలంకరించుకుని ఆలయానికి వెళ్లింది. ధనుర్మాసంలో గోదాదేవి ప్రాశస్త్యాన్ని పురస్కరించుకుని ఆమెను ఇలా అలంకరించారు. **- ద్వారకాతిరుమల**

27న జిల్లా మత్స్యకార సొసైటీ ఎన్నిక

» బరిలో ఐదుగురు అభ్యర్థులు

నరసాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా మత్స్యకార సహకార సంఘం ఎన్నిక ఉత్కంఠంగా మారింది. ఈనెల 27న ఏలూరులో జరిగే అధ్యక్ష ఎన్నికకు ఐదుగురు అభ్యర్థులు పోటీపడుతున్నారు. వీరిలో ప్రస్తుత అధ్యక్షుడు అంగ్రాజు చల్లారావుతో పాటు పెంటపాడు నుంచి బీజేపీ మద్దతుతో ఒకరు, మెట్ట ప్రాంతం నుంచి మరొకరూ ఉండగా నరసా పురం నుంచి ఇద్దరు పోటీలో ఉన్నారు. దీంతో ఈసారి ఎన్నిక ఏమవుతుందోనన్నది సస్పెన్స్‌గా మారింది. గత నెలలో ఈ ఎన్నిక జరగాల్సి ఉంది. అయితే న్యాయస్థాన పరిధిలో ఉండటంతో అధికారులు వాయిదా వేశారు. ఈక్రమంలో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సొసైటీ ఎన్నికలను కూడా పూర్తి చేశారు. దీంతో ఉమ్మడి పశ్చిమలో 137 సొసైటీల అధ్యక్షులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇప్పటికే బరిలో నిలిచిన అభ్యర్థులు ఈసారి తమకు మద్దతు ఇవ్వాలని ప్రచారాన్ని కూడా పూర్తి చేశారు. ఇటు రాజకీయ మద్దతును కూడగట్టుకుంటున్నారు. దీంతో ఎన్నికలు జరిగితే విజయం ఎవర్ని వరిస్తుందోనన్నది పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి పశ్చిమలో పోలవరం, తాళ్లపూడి, కొవ్వూరు, సిద్ధాంతం, నిడదవోలు, ఆచంట, పోడూరు, యలమంచిలి, నరసాపురం, మొగల్తూరు, భీమవరం, కొల్లేరు ప్రాంతాల్లో మత్స్యకారులు అత్యధికంగా ఉన్నారు. వేట సాగించే వీరంతా సొసైటీలుగా ఏర్పడి ప్రభుత్వం అందించే సహాయ సహకారాలు అందుకుంటున్నారు. ఒక్కొక్క సొసైటీలో 500 నుంచి 1500 మంది దాకా సభ్యులు ఉంటారు. కొన్ని సొసైటీలు 200 మందికే పరిమితయ్యాయి. మెజార్టీ సొసైటీలు పశ్చిమలోనే ఉన్నాయి. అందులో అత్యధికంగా నరసాపురం ప్రాంతంలోనే ఉన్నాయి. గత రెండు పర్యాయాలు నరసాపురం ప్రాంతానికి చెందిన అంగ్రాజు చల్లారావు జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతూ వచ్చారు. ప్రస్తుతం ఆయన వైసీపీలో ఉన్నారు. ఆయన్ని ఈసారి గెలవనివ్వకుండా కూటమి పార్టీలు గట్టి ప్రయత్నం చేస్తున్నాయి. దానిలో భాగంగానే నరసాపురం నుంచి జనసేనకు చెందిన మైలా వసంతరావు, తిరుమాని సీత మహాలక్ష్మి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ ఈ ఎన్నికకు ఇంత పోటీ లేదు. ఈసారి గట్టి పోటీ ఉండటంతో అధికార యంత్రాంగం కూడా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు.



జిల్లా హ్యాండ్ బాల్ కార్యవర్గం

పాలకోడేరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శృంగవృక్షం పాఠశాలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా హ్యాండ్ బాల్ జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. ప్రెసిడెంట్‌గా ఎంవీ ప్రసన్న లక్ష్మి, సెక్రటరీగా కె.శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా పి.సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. హ్యాండ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర నిర్వాహకుడు గోపీకృష్ణ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. శాప్ నుంచి కోచ్ దుర్గారావు, పీడీలు చిట్టిబాబు, ఖుద్దూస్ పాల్గొన్నారు.

పగిలిన మంచినీటి సరఫరా పైప్‌లు

240 గ్రామాలకు నిలిచిన మంచినీటి సరఫరా



మెయిన్ లైన్ మరమ్మతులకు గురై నీరు లీకవుతున్న దృశ్యం

పోలవరం డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి మంచినీటి సరఫరాకు గ్రహణం పట్టింది. ఇప్పటికే రెండు వారాలుగా పైపులైన్లు పగిలిపోయి పోలవరం మండలానికి నీటి సరఫరా నిలిచిన నేపథ్యంలో సత్యసాయి మంచినీటి కార్మికులు యడ్లగూడెం సమీపంలో మరమ్మతులు చేసి నీటి సరఫరా పునరుద్ధరించగా పాతపోలవరం వద్ద మరో రెండు చోట్ల పైపలైన్లు పగిలి మరమ్మతులకు గురయ్యాయి. దీంతో మళ్ళీ నీటి సరఫరా నిలిపి మరమ్మతులకు ఉపక్రమించారు. తాజాగా సోమవారం కన్నాపురం అడ్డరోడ్డు వద్ద మెయిన్ పైపులైన్ల పైపులు పగిలిపోయి నీరు భారీ స్థాయిలో లీకవుతున్న నేపథ్యంలో సత్యసాయి కార్మికులు మంచినీటి సరఫరా పూర్తిగా నిలిపివేశారు. పైపులు పగిలిన ప్రాంతంలో మరమ్మతులు చేయడానికి నీటిని మోటార్లతో తోడే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మంచి నీటి సరఫరా నిలిపివేయడంతో పోలవరం, కొవ్వూరు, గోపాలపురం, చింతలపూడి నియోజక వర్గాల్లో 17 మండలాల్లో సుమారు 240 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో గ్రామాల ప్రజలు మంచినీటి అవసరాలకు ఇబ్బందులకు గురవుతు న్నారు. అధికారులు స్పందించి నాణ్యమైన పైపులైన్లు వేసి మరమ్మతులు చేసి మంచినీటి సరఫరా పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు



ఏలూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏలూరుజిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ కోచ్ జి.కె.వి సుబ్బారావు స్మారకంగా జిల్లా నిడ్జెమ్ అథ్లెటిక్స్‌మీట్ సోమవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలను సినీదర్శకుడు మలినేని గోపిచంద్ సతీమణి సత్య ప్రారంభించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ప్రసాదరావు, కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి జి.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి



చిన్నారిని పరామర్శిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి

ఏలూరు క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వసర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ భవనంలో సోమవారం 9 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యా సంస్థలు, బ్యాంక్ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు స్వచ్ఛంద రక్తదాతల సహకారంతో తలసేమియా చిన్నారులకు 1000 నుంచి 1200 రక్త యూనిట్లు సరఫరా చేస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎస్‌వీవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఆర్‌ఎస్ ఆర్‌కె వర ప్రసాదరావు, రెడ్‌క్రాస్ కార్యదర్శి కేవీ సీతారామ్, డాక్టర్ జి.స్పందన పాల్గొన్నారు.

అక్రమ మద్యంతో ఒకరి అరెస్టు

భీమవరం క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ సీఐ బలరామరాజు తెలిపారు. భీమవరం మండల ఎల్‌వీఎన్ పురంలో పాలా గణపతి మద్యం విక్రయిస్తుండగా 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చెయ్యడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు ఉమా మహేశ్వరరావు, సునీల్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

బిడ్డకు వరం.. తల్లికి ఆరోగ్యం!



భీమవరంలో తల్లిపాల సేకరణ బ్యాంకు కార్యాలయం (ఇన్‌సెట్‌లో) తల్లి నుంచి పాలు సేకరించే పరికరం

ఇదే తల్లిపాల బ్యాంకు లక్ష్యం

» భీమవరంలో తల్లిపాల బ్యాంకు ఏర్పాటు
» రాష్ట్రంలో ఇది రెండవ బ్యాంకు
» బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వల్ల ఇద్దరికి ఎన్నో ప్రయోజనాలు



భీమవరం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరం. బాల సంజీవిని అయిన తల్లిపాలు బిడ్డకు అందాలనే ఆశయంతో మహిళల్లో అవగాహన కల్పించేందుకు భీమవరంలో తల్లిపాల బ్యాంకును నెలకొల్పారు. భీమవరం ఏరియా ఆసుపత్రిలో దీనిని ప్రారంభించారు. పుట్టిన బిడ్డకు సరిపడిన పాలు కంటే అధికంగా ఉంటే ఆ తల్లి నుంచి సేకరించి భద్రపరుస్తారు. ఇలా సేకరించిన పాలు ఏడాది భద్రంగా ఉంటాయి. దానికి సంబంధించిన యంత్ర పరికరాలను తల్లిపాల బ్యాంకులో సిద్ధం చేశారు. తల్లినుంచి పాలు సేకరించడానికి అవసర మైన పనిముట్లను ఉంచారు. పాలు ఉత్పత్తి కానీ తల్లి కన్న బిడ్డకు పాల బ్యాంకు నుంచి అందిస్తారు. బిడ్డకు పట్టిస్తారు.

దాతల సహకారం

తల్లిపాల బ్యాంకు కోసం భీమవరంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రూ.1.50 కోట్లు వెచ్చిస్తున్నారు. దాతలు ముందుకు వస్తున్నారు. నాగార్జున కన్‌స్ట్రక్షన్ తరుపున సీఎస్‌ఆర్ నిధులతో ఏర్పాటు చేశారు. సశే ఐహెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాత్రి తల్లిపాల బ్యాంకు ప్రారంభించారు. ముగ్గురు మహిళా సిబ్బందిని నియమించారు.

పురిటి తల్లులకు కౌన్సెలింగ్

ఏరియా ఆసుపత్రిలో పాల బ్యాంకుకు చెందిన మహిళా కౌన్సిలర్స్ పురిటి తల్లులకు అవగాహన కల్పిస్తారు. బిడ్డకు తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తారు. తల్లి నుంచి పాలు ఉత్పత్తి కాకపోతే మసాజ్ ద్వారా పాలు ఉత్పత్తిచేసే విధంగా కౌన్సిలర్లు చర్యలు తీసుకుంటారు. పాలు ఉన్నా సరే పాలు తాగటానికి ఇబ్బంది పడుతుంటే తల్లికి శిక్షణ ఇస్తారు. ఏ పోజిషన్‌లో ఇవ్వాలో అవగాహన కల్పిస్తారు. పుట్టిన బిడ్డకు పాలు తాగించిన తరవాత కూడా పాలు ఉంటే ఆ తల్లి నుంచి పాలను సేకరిస్తారు. వాటిని పూర్తిస్థాయిలో మైనస్ 20 డిగ్రీల వద్ద భద్రపరుస్తారు. తల్లి పాలు అవసరమైనవారికి అందజేస్తారు. మాములుగా ఉంచితే 4 గంటలు వరకు ఉపయోగంలో ఉంటాయి. ఫ్రిజ్‌లో ఉంచితే 24 గంటల వరకు పనిచేస్తాయి. అదే మైనస్ 20 డిగ్రీల వద్ద ఉన్న శీతల మిషన్‌లో ఉంచితే 6నెలలకు పైగా ఉపయోగంలో ఉంటాయి.

పాలామృతం కొందరికే..

తల్లిపాలు అందని పురిటి బిడ్డలు ఎందరో ఉన్నారు. దేశంలో అనేక మంది పిల్లలకు తల్లి పాల పోషణ కరువైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం పిల్లల మరణాలకు 53శాతం శ్వాస కోశ వ్యాధులు, 55 శాతం నీళ్ళ విరోచనాలు కారణమని తెలిపింది. 6నెలలు పాటు పిల్లలకు తల్లిపాలు అందకపోవమే కారణమని గుర్తించింది. మన దేశంలో 24.5 శాతం మంది పిల్లలకు మాత్రమే తల్లిపాలు అందిస్తున్నారు. అందరి పిల్లలకు తల్లిపాలు అందలనే ఆశయంతోనే తల్లిపాలు బ్యాంకును ఏర్పాటుచేశారు.

అంతా ఉచితమే

తల్లిపాల బ్యాంకులో నుంచి పాలు తీసుకుంటే ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. అంతా ఉచితంగానే సేవలు అందిస్తారు. ప్రస్తుతం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో ఉన్న తల్లుకు మాత్రమే అవగాహన కల్పిస్తారు. బయటనుంచి ఏతల్లి అయినా బ్యాంకుకు పాలు అందించినా స్వీకరిస్తారు. అయితే సంబందిత తల్లికి సంబంధించి మెడికల్ రిపోర్టు వీరికి అందించాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించిన తరువాతనే పాలను సేకరించుకుని భద్రపరుస్తారు.

తల్లిపాలుతోనే ఆరోగ్యం

ప్రవీణ్ కుమార్ ఎండీ, పిడియాట్రిక్-భీమవరం ప్రభుత్వాసుపత్రి



తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం. బిడ్డపుట్టిన వెంటనే తల్లి నుంచి వచ్చే ముర్రుపాలను పట్టించాలి. చిక్కగా ఉంటాయ ని కొంత మంది పట్టించరు. అది తప్పు. ఆ పాలల్లో పోషక విలువలు ఎంతో ఉంటాయి. తప్పక పట్టించాలి. దీని వల్ల తల్లి ఆరోగ్యానికి ఎంతో మంచిది. 6నెలలుపాటు ఇవ్వటం వల్ల బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరిగి నీళ్ళ విరోచనాలు, దగ్గు, జ్వరాలు వంటివి రావు.

తల్లి-బిడ్డ మధ్య ప్రేమాను బంధం

తల్లి పాలను ఇవ్వటం వల్ల వారి ఇద్దరి మధ్య అనుబంధం పెరగటానికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. బిడ్డకు తల్లిపాలు ఇవ్వటం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. తల్లికి రొమ్ము క్యాన్సర్, గర్భాశయక్యాన్సర్ నివారణకు తోడ్పడుతున్నది.

అవగాహన ఎంతో అవసరం

తల్లి పాల బ్యాంకు వల్ల ఎటువంటి ప్రయోజనం అనేది అందరికి అవగాహన ఎంతో అవసరం. అందుకే ముందుగా బ్యాంకు గురించి అవగాహన పెంచే విధంగా స్వచ్ఛంద సంస్థలు ప్రచారంచేసి ప్రజలల్లోకి తీసుకువెళ్తే భవిష్యత్‌లో బ్యాంకు ఎంతో మంది పిల్లలకు ఉపయోగకరంగా మారే అవకాశం ఉంది.

క్రైమ్ కార్నర్

లారీ ఢీకొని గొర్రెల కాపరి మృతి

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొండ్రుప్రోలు జాతీయ రహదారిపై గొర్రెల మందలను మళ్ళీస్తుండగా లారీ అతి వేగంగా వచ్చి ఢీకొన్న ప్రమాదంలో గొర్రెల కాపరి తీర్థాల ఆదియ్య (43) అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉంగుటూరు మండలం చింతయిగూడెంకు చెందిన ఆదియ్య తన గొర్రెల మందలతో 15 రోజుల క్రితం ఇంటి నుంచి తాడేపల్లిగూడెం, ఉంగుటూరు ప్రాంతాల్లో వరిచేలలో మేపేందుకు వచ్చాడు. ఆదివారం కుంచనపల్లిలో గొర్రెల మందలను మేపి తిరిగి బాదంపూడి వైపు వెళ్లేందుకు జాతీయ రహదారి మీదుగా వెళ్తుండగా శశి కళాశాల ఎదురుగా వచ్చే సరికి లారీ అతి వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెం దాడు. ఈమేరకు భార్య దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు.

చెరువులో గేదెను కాపాడబోయి వ్యక్తి మృతి

చింతలపూడి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం గ్రామంలో చెరువులో పడి ఉన్న గేదెను రక్షించబోయి గ్రామానికి చెందిన అనుపోజు ధర్మలింగాచారి(52) మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం చెరువులో ఉన్న గేదె కాళ్లకు ఉన్న లంకెను తొలగించడానికి చెరువులోకి దిగిన ధర్మలింగాచారి లంకె తొలగించే సమయంలో గేదె మీద పడటంతో చెరువులోనే అతను మృతి చెందాడు. గేదె కూడా మృతి చెందింది. పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని వెలికితీశారు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేపి దర్యాప్తు చేస్తున్నారు.

జరిమానా సరిచేశాం : డీటీసీ

ఏలూరు క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఒక బొలెరో వాహనానికి కోటి 70 లక్షల రూపాయలు జరిమానాను ఆన్‌లైన్ టెక్నికల్ ఎర్రర్ రావడం వల్లే రసీదు వచ్చిందని జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ షేక్ కరీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. బొలెరో వాహనం మూడు టన్నులు అదనంగా ఉండడంతో ఆ వాహనం ఆన్‌లైన్ విధించే సమయంలో టన్నులకు బదులుగా మూడు వేల కేజీలని నమోదు చేసే సమయంలో పొరపాటు జరిగిందని దీని వల్ల కోటి 70 లక్షల రూపాయలు జరిమానాగా రసీదు రావడం జరిగిందన్నారు. అయితే జరిమానాను ఆన్‌లైన్‌లో సరిచేయడానికి ఆదివారం సెలవు దినం కావడంతో సోమవారం సరిచేసినట్లు తెలిపారు. ఆ వాహనానికి 26 వేల 200 రూపాయలు మాత్రమే జరిమానా విధించి యజమానికి తెలియజేశామని అన్నారు.

బంగారం వ్యాపారి పట్టివేత

» 6.786 కేజీల బంగారం, 106 కేజీల వెండి, కారు, రూ.3లక్షల నగదు స్వాధీనం
» తోటి వ్యాపారులకు కుచ్చుటోపీ ...ఆపై పరార్



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అప్పుల భయంతో తోటి వ్యాపారుల వద్ద బంగారం, వెండి, నగదు సేకరించి ఊరు నుంచి వెళ్లిపోయాడని డీఎస్పీ డి.విశ్వనాథ్ తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం బంగారు వ్యాపారుల వద్ద బంగారం పట్టుకుపోయిన మాన్వీ జ్యూయలర్స్ యజమాని లెంకా రమణ బాబు అరెస్టు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని మహాలక్ష్మినగర్‌కు చెందిన మాన్వీ జ్యూయలర్స్ యజమాని బులియన్ వ్యాపారిగా చేసిన అనుభవం ఉంది. అయితే తన తండ్రి దశాబ్దాలుగా బంగారం వ్యాపారుల వద్ద నమ్మకంగా బులియన్ వ్యాపారిగా నమ్మకం పెంచుకున్నాడు. ఆ తండ్రిపై ఉన్న నమ్మకంతో రమణబాబును నమ్మి తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, భీమవరం తదితర ప్రాంతాలకు చెందిన బంగారు వ్యాపారులు రమణబాబుకు భారీగా బంగారం, వెండి ఇచ్చారు. అప్పటికే అప్పుల భయంతో ఉన్న రమణబాబు ఒకేసారి భారీగా బంగారం, వెండి సేకరించి ఆ సొత్తుతో ఊరు నుంచి వెళ్లిపోయాడు. రమణబాబుకు బంగారం ఇచ్చిన వ్యాపారులకు అనుమానం వచ్చి ఆరా తీస్తే పరారయ్యాడని నిర్ధారించుకున్నారు. ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో ఒక్కొక్కరుగా పోలీసులను ఆశ్రయించారు. ఇప్పటికి 33 మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఎస్పీ విశ్వనాథ్ పర్యవేక్షణలో సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు హైదరాబాద్, కొవ్వూరు, విశాఖపట్నం ప్రాంతాల్లో తిరుగుతూ అతని వద్ద ఉన్న బంగారం, వెండి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం రావడంతో రమణబాబును అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.3లక్షల నగదు, 6.786 కేజీల బంగారం, 106.772 కేజీల వెండి, కారు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

వైఎస్‌ఆర్‌కాలనీలో చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

నరసాపురం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్‌ఆర్‌కాలనీ లో సోమవారం పట్టపగలు తాళం వేసిన ఇంటి తలుపు పగలగొట్టి చోరీ చేశారు. కాలనీలో నివాసం ఉంటున్న లక్కు లక్ష్మి ఇంటిలో రూ.60వేల నగదు, మూడు బంగారపు ఉంగరాలు, సుమారు కేజీ విలువ చేసే వెండి వస్తువులు అపహరించుపోయారు. చోరీ జరిగిన సమయంలో బాధితురాలు ఆస్పత్రికి వెళ్లింది. ఇంట్లో శబ్దాలు వస్తుండటంతో చుట్టుపక్కల వారు అనుమానం వచ్చి బయటకురాగా దొంగ పారిపోవడాన్ని గమనించారు. పట్టుకునే ప్రయత్నం చేసినప్పటికీ చిక్కలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించారు. ఈకేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్యాలరావు చెప్పారు.

మద్యం మత్తులో డ్రెయిన్‌లో దూకిన వ్యక్తి



భీమవరం క్రైం, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణంలోని గరగపర్రు రోడ్డులో బీవీ రాజు విగ్రహం సమీపంలోని వంతెన పైనుంచి ఒక వ్యక్తి యనమదుర్రు డ్రెయిన్‌లోకి దూకాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక బీవీ రాజు విగ్రహం సమీపంలో మూడు మద్యం షాపులు ఉన్నాయి. అక్కడ మద్యం తాగిన ఒక వ్యక్తి వంతెనపైకి వెళ్ళి డ్రెయిన్‌లో దూకాడు. దీంతో అది చూసిన కొందరు యువకులు వెంటనే అతనిని కాపాడారు. చివరకు ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అతని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఆసుపత్రికి తరలించినట్లుగా తెలిపారు.

ఈవ్ టీజింగ్ చేస్తున్న వ్యక్తిపై బైండోవర్ కేసు

అత్తిలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అత్తిలి మండలం బల్లిపాడు ఉన్నత పాఠశాల వద్ద ఈవ్‌టీజింగ్ చేస్తున్న గణపవరం మండలం మొయ్యేరు గ్రామానికి చెందిన పులిదిండి రవితేజ అనే యువకునిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ తెలిపారు. రవితేజ ఉన్నత పాఠశాల వద్ద తరచూ బాలికలను ఈవ్‌టీజింగ్ చేస్తూ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై అత్తిలి ఎస్ఐ పి ప్రేమరాజు రవితేజను అదుపులోకి తీసుకొని తహసిల్దార్ దశిక వంశీ కోర్టులో హాజరుపరిచారు. రవితేజ నుంచి బైండ్ ఓవర్ పత్రాలను తీసుకున్నట్లు తహసీల్దార్ వంశీ తెలిపారు.



కొబ్బరి చెట్టుకు నిప్పు

పరుగులు తీసిన ప్రజలు

పెనుమంత్ర, డిసెంబర 23 (ఆంధ్రజ్యోతి) : మార్టేరులో ఆదివారం రాత్రి అసలు ఏం జరిగిందో తెలియదు కానీ ఒక్కసారిగా కొబ్బరి చెట్టుకు మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు పరుగులు తీశారు. నిప్పంటుకున్న కొబ్బరి చెట్టుకు సమీపంలోనే హెచ్‌.పీ గ్యాస్ గొడౌన్ ఉన్నది. కొబ్బరి చెట్టు కింద ఉన్న తాటాకు ఇంట్లో గ్యాస్ ఏజెన్సీలో పనిచేసే కొందరు పది గ్యాస్ సిలిండర్లు ఉంచారు. ప్రమాదం జర గడంతో స్థానికులు పరుగులు తీశారు ఆ క్రమంలోనే ఆ తాటాకు ఇంట్లో గ్యాస్ బండలను స్థానికుల సహకారంతో తరలించారు. చుట్టుపక్కలకు మంటలు వ్యాపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకుని జనావాసాల్లో ఉన్న గ్యాస్ ఏజెన్సీని వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.



అంబులెన్స్‌లో కోలనపల్లికి జాన్ డేవిడ్ మృతదేహం

కోలనపల్లి యువకుడు లెబనాన్‌లో మృతి

నెల రోజుల తర్వాత స్వగ్రామం చేరుకున్న మృతదేహం

కాళ్ళ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి కోసం దేశం విడిచి వెళ్ళిన యువకుడు విగతజీవిగా తిరిగి వచ్చాడని తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. కాళ్ళ మండలం కోలనపల్లికి చెందిన యాళ్ళ జాన్ డేవిడ్ (26) జీవనోపాధి నిమిత్తం రెండు సంవత్సరాల క్రితం ఖత్తర్ దేశానికి వెళ్ళాడు. అక్కడ ఒక స్పాన్సర్ దగ్గర హౌస్ మేడ్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. కొద్ది నెలల క్రితం జాన్ డేవిడ్‌ను స్పాన్సర్ లెబనాన్ దేశానికి తీసుకువెళ్ళాడు. అక్కడ గత నెల 24వ తేదీన జాన్ డేవిడ్ గన్ శుభ్రపరుస్తుండగా మిస్ ఫైర్ జరిగి చనిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇండియాకు రప్పించడం కోసం భీమవరంలో ఉన్న నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్‌ని సంప్రదించారు. ట్రస్ట్ కో-ఆర్డినేటర్ రవి లెబనాన్‌లో ఉన్న ఇండియన్ ఎంబసీకి జాన్ డేవిడ్ మరణ వార్త తెలియజేసి మృతదేహాన్ని ఇండియాకు రప్పించారు. హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఏపీఎన్ ఆర్టీఎస్ వారు ఉచిత అంబులెన్స్‌లో మృతదేహాన్ని కోలనపల్లిలోని డేవిడ్ ఇంటికి సోమవారం సాయంత్రం తీసుకువచ్చారు.

నేడు నగర పాలక సంస్థ పాలక మండలి సమావేశం

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పాలక మండలి సమావేశం ఈ నెల 24వ తేదీ ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో 16 అంశాలపై కౌన్సిల్‌లో చర్చించనున్నారు. కార్పొరేట ర్లంతా విధిగా హాజరుకావాలని కమిషనర్ తెలిపారు.

నేడు పీసా గ్రామసభలు

బుట్టాయగూడెం/పోలవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 24న పీసా గ్రామ సభల నిర్వహణకు మండల స్థాయి అధికారులను నియమించినట్టు ఎంపీడీవో కె.జ్యోతి తెలిపారు. సభల అనంతరం నివేదికలను అధికారులు అందించాలన్నారు. పోలవరం మండలంలో పీసా గ్రామ సభలు నిర్వహించి పంచాయతీలలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జీలుగుమిల్లి: మంగళవారం పీసా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి ప్రకటనలో తెలిపారు. మండలంలో 12 పంచాయతీల్లో మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో గ్రామ సభలు విజయవంతం చెయ్యాలన్నారు.

27న వాలీబాల్ జట్ల ఎంపికలు

ఏలూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సీనియర్ మహిళలు, పురుషుల వాలీబాల్ జట్టు రాష్ట్రస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు జనవరి 7 నుంచి 13 వరకు రాజస్థాన్‌లో జరిగే సీనియర్ జాతీయ వాలీబాల్ పోటీలకు ఏపీ నుంచి పాల్గొంటారని ఆయన తెలిపారు. 27వ తేదీ ఉదయం 7 గంటలకు ఆధార్‌కార్డు, నివాస ధ్రువ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో విజయవాడలోని క్రీడా ప్రాధికార సంస్థ వాలీబాల్ కోర్టులో హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

27న క్రికెట్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ఏలూరు ఆశ్రం కళాశాల మైదానంలో అండర్ -12 బాలుర క్రికెట్ టీమ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు జి.ఆదిత్య వర్మ, వీవీఎస్ఎం శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికులు ఆరోజు ఉదయం 9 గంటలకు క్రీడా మైదానంలో హాజరు కావాలన్నారు. ఒరిజినల్ జిరాక్స్, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్ కాపీలు తీసుకురావాలని కోరారు.

అభయాంజనేయస్వామి హుండీ లెక్కింపు

పెదపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు జరిగింది. 96 రోజులకు గాను రూ.11,49,981లు ఆదాయం లభించినట్లుగా ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. లెక్కింపును ఇన్‌స్పెక్టర్ వి.సురేష్ పర్యవేక్షించారని, లెక్కింపులో కూటమి నాయకురాలు వడ్డి వాసవితో పాటు దేవాలయ అధికారులు, సిబ్బంది, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'మిత్రదీప్' వితరణ

లింగపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సూర్యప్రకాష్ కుటుంబానికి అండగా ఉంటానని మిత్రదీప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సొంగా సందీప్ అన్నారు. ఇటీవల చాత్రాయి మండలం తుమ్మగూడెంలో ప్రమాదవశాత్తు కాలువలో పడి మరణించిన పొదిల సూర్యప్రకాష్ కుటుంబాన్ని సందీప్‌తో పాటు సొంగా ఉదయ్ పరామర్శించారు. క్రిస్మస్ సందర్భంగా దుస్తులు, స్వీట్స్ ఆర్థిక సాయం అందజేశారు.

మృతుడి కుటుంబానికి సెక్యూరిటీ సిబ్బంది సాయం

ద్వారకాతిరుమల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిన్నవెంకన్న దేవస్థానంలో సెక్యూరిటీ విభాగంలో పనిచేసి ఇటీవల మృతి చెందిన కామవరపుకోటకు చెందిన భైరవ పాటి శివరామకృష్ణ కుటుంబాన్ని తోటి సెక్యూరిటీ సిబ్బంది ఆదుకున్నారు. తమ ఒకరోజు వేతనం రూ.35 వేలను సోమవారం మృతుని కుటుంబానికి అందజేశారు

ఆముదాలచిలకలో రీసర్వే

చింతలపూడి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రెవెన్యూ భూమి రీసర్వే ప్రాజెక్టులో భాగంగా మండలంలోని ఆముదాలచిలక గ్రామంలో సోమవారం రీసర్వే బౌండరీని నమోదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం రీసర్వే ప్రాజెక్టులో భాగంగా మండలంలోని ఆముదాలచిలక గ్రామం ఎంపికైందని, సరిహద్దు నమోదు చేసి గ్రామ మొత్తం భూముల రీసర్వే జరిపి ప్రస్తుతం ఉన్న వివరాలను నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మల్లాయిగూడెం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొని 14 దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్ చీకటి కవిత, ఉప సర్పంచ్ యేసుపాదం, నీటి సంఘం అధ్యక్షుడు చీకటి బాబూరావు, మొరంపూడి సత్యనారాయణ, కంచర్ల బాబూరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలలు అకృత్యాలను ఎదిరించాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్ శ్రీ చైతన్య పాఠశాలలో బేటీ సమ్మాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై క్రాంతిప్రియ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సాంఘిక దురాచారాలు, మూఢ నమ్మకాలు, అకృత్యాలు ఎదుర్కొనేలా నేటి బాలలు సిద్ధం కావాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం బి.శివకుమారి పాల్గొన్నారు.


సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాలలో..


శ్రీసూర్యలో క్రీస్తు జననం నాటిక ప్రదర్శన


రామచంద్ర కళాశాలలో వేడుకలు


సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న సీఐ విల్సన్

ఉత్సాహంగా సెమీ క్రిస్మస్

పెదవేగి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. పశువుల పాక, గొర్రెలు, దేవదూత, మేరీమాత చిత్రాలు ఆకట్టుకున్నాయి. ప్రతి ఏటా క్రిస్మస్ సమయంలో క్రీస్తు జనన దృశ్యాలను నిర్మించి, ప్రదర్శనకు ఉంచుతామని కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ చెప్పారు.

ఏలూరు రూరల్: తోటివారిని ప్రేమించటమే క్రీస్తు లోకానికి చూపిన మార్గమని పాస్టర్ రత్నప్రసాద్ అన్నారు. సోమవారం తంగెళ్ళమూడి శ్రీ సూర్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆ పాఠశాల డైరెక్టర్ కొండపల్లి పరమేశ్వర రావు, కరస్పాండెంట్ కొండపల్లి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు క్రీస్తు జననంపై నాటిక ప్రదర్శించారు. అనంతరం కేక్ కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కొండపల్లి లక్ష్మి, ప్రిన్సిపాల్ డానియేల్, హెచ్‌ఎం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పెదపాడు: సెమి క్రిస్మస్‌ను నిర్వహించుకోవడం సంతోషకరమని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల ఎండీ కె.సాయిరోహిత్ తెలిపారు. ప్రైయిజ్ మినిస్ట్రిస్ ఆధ్వర్యంలో రామచంద్ర కళాశాలలో సెమి క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పాస్టర్ సునీల్‌ప్రేమ్ సమక్షంలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి దేవుని వ్యాక్యాన్ని అందించారు.

కళాశాల డైరెక్టర్ డాక్టరు ఎం.మురళీధరరావు, డీన్ అకడమిక్ అఫైర్స్ డాక్టరు ఎస్.ఎస్.శర్మ, డీన్ ఇంటర్నల్ అఫైర్స్ డాక్టరు ప్రసాద్, డీన్ ప్లేస్‌మెంట్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు: భీమడోలులోని మాధురి జూనియర్, రత్నా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సెమి క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా భీమడోలు సీఐ విల్సన్ పాల్గొని క్రిస్మస్ విశిష్టతను వివరించారు. జాషువాపాల్, ఎం విజయ్‌కుమార్, మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం అంతర్‌కళాశాల పోటీల్లో బాడీబిల్డింగ్ 65 కేజీల విభాగంలో రత్నా డిగ్రీ కళాశాల తరపున యూనివర్సిటీ స్థాయిలో టాప్ 3లో కాంస్య పతకం సాధించిన విద్యార్థి సందీప్‌ను సత్కరించారు.



ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో సంయుక్త కిసాన్ మోర్చ నాయకులు నిరసన

నిరసనల హోరు

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఏలూరులో సోమవారం కార్మిక సంఘాలు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా నూతన మార్కెట్ చట్టం ముసాయిదా విడుదలపై నిరసన తెలిపారు. నగరంలో ర్యాలీ నిర్వహించి పాత బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ముసాయిదా చట్టం కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చ నాయకులు కె.శ్రీనివాస్, డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మార్కెట్ చట్టం ముసాయిదాను తక్షణం రద్దు చేయాలన్నారు. రైతు ఉద్యమంపై నిర్బంధ చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు.

కుక్కునూరు: ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై అణచివేత ఆపేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా నాయకులు ఎం.వెంకటాచారి, కొన్నే లక్ష్మయ్య, కె. బాబురావు తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: అక్రమ కేసులతో నోయిడా జైల్లో నిర్బంధించిన రైతులను బేషరతుగా విడుదల చేయాలని ఇఫ్టూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కెఆర్ పురం గిరిజన కార్పొరేషన్ వద్ద ఇఫ్టూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలియజేశారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి..

జంగారెడ్డిగూడెం: నెర్సిగూడెం రెవెన్యూ పరిధిలో ఆదివాసీలకు చెందిన భూములను గిరిజనేతరులకు మ్యూటేషన్లు చేసే రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు.

పీడీఎస్‌యూ ఆందోళన

బుట్టాయగూడెం: ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కేఆర్ పురం ఐటీడీఏ కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ, పీవైఎల్ సంఘాల ఆధ్వర్యంలో నాయకులు, విద్యార్థులు ఆందోళన చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.భూషణం మాట్లాడుతూ నెల రోజులుగా గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపకులు అమరావతిలో విధులు బహిష్కరించి ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటి కైనా ప్రభుత్వం స్పందించి ఆందోళన చేస్తున్న వారితో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరిం చాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నవారికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని జిల్లా ఉపాధ్యక్షుడు బి.వినోద్ డిమాండ్ చేశారు. అనంతరం డీడీ పీవీటీఎస్ నాయుడికి వినతి పత్రాన్ని అందజేశారు.

జీతాలు విడదల చేయకుంటే సమ్మె

చింతలపూడి: ప్రభుత్వం ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బకాయిలు విడుదల చేయకపోతే మంగళవారం నుంచి సమ్మెలోకి వెళ్తామని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు టి.బాబు పేర్కొన్నారు. ఏరియా ఆసుపత్రి వద్ద పారిశుద్ధ్య కార్మికులు సోమవారం నాల్గవ రోజు ధర్నాలో పాల్గొన్నారు. మరియమ్మ, నాగరాజు, సుజాత, వాణి పాల్గొన్నారు.

ప్రశ్నించే తత్వం ఉండాలి

ఏలూరు క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వ్యక్తి వస్తువుల కొనుగోలు వ్యవహారాల్లో ప్రశ్నించే తత్వం ఉండాలని ఏలూరు శ్రీ శర్వాణీ పబ్లిక్ స్కూల్ హెడ్‌మాస్టర్ మురళీ అన్నారు. కొవ్వలి వినియోగదారుల సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం శర్వాణీ పబ్లిక్ స్కూల్‌లో జాతీయ వినియోగదారుల వారోత్సవాలను పురస్కరించుకుని వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై వినియోగదారుల చట్టం - 2019పై అవగాహన సదస్సును నిర్వహించారు. సీనియర్ న్యాయ వాది కట్టా సత్యనారాయణ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ డిస్కౌంట్‌లో అమ్మకాలపై ప్రచారం చేస్తే అసరం లేకున్నా కొంటున్నారన్నారు. సీనియర్ న్యాయవాది సీఏపీఎస్ రామానుజాచార్యులు మాట్లాడుతూ తూనికలు, కొలతల్లో వినియోగదారుడు మోసపోతున్నాడని ఇలాంటి వాటిని గమనించి ఫిర్యాదు చేయాలన్నారు. రిటైర్డ్ హెడ్‌మాస్టార్ కస్తూరి, న్యాయవాదులు జోసఫ్, వై శిరీష తదితరులు పాల్గొన్నారు.

నేరుగా విత్తే విధానం మేలు

పెదవేగి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న నేరుగా విత్తే విధానం రైతులకు మేలు చేస్తుందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ బి.రోశయ్య అన్నారు. నూజివీడు సీడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పెదవేగి మండలం వంగూరులో మొక్కజొన్న సాగులో మెళకువలపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఖరీఫ్ సాగు అనంతరం వరి పొలాల్లో మొక్కజొన్న సాగుచేస్తే పంట మార్పిడితో దిగుబడి పెరుగుతుందని చెప్పారు. మొక్కజొన్నలో అధిక దిగుబడినిచ్చే హైబ్రీడ్ ఎన్ఎంహెచ్- 8352 విన్నర్ రకం మొక్కజొన్నకు ఈ ప్రాంతం అనుకూలమన్నారు. నూజివీడు సీడ్స్ సంస్థ రీజనల్ మేనేజర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పీవీకి ఘన నివాళి

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పీవీ దేశా నికి ఎనలేని సేవలు చేశారని వక్తలు పేర్కొన్నారు. యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాయల సతీష్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గాంధీ మైదానం సెంటర్‌లో మాజీ ప్రధాని పీవీ నర సింహారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పీఎంపీల పాత్ర కీలకం : చంటి

ఏలూరు అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలందించడంలో పారా మెడిక్స్ (పీఎంపీలు) ప్రధాన భూమికను పోషిస్తున్నారని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. కమ్యూనిటీ పారా మెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 62వ వ్యవస్థాపక వేడుకలు సోమవారం స్థానిక మర్చంట్స్ చాంబరు హాలులో నిర్వహించారు. ఎమ్మెల్యే చంటి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ గ్రామీణ వైద్యంలో నిలిచిపోయిన కమ్యూనిటీ పారామెడిక్స్ శిక్షణను మళ్ళీ ప్రారంభించేలా సీఎంకు విన్నవిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులో భాగంగా వలు వ్యాధులు, సంతాన సాఫల్యతపై వైద్యనిపుణులు డాక్టర్ శ్రీకృష్ణ, డాక్టర్ జి.రోషిణి వివరించారు.



విద్యకు అధిక ప్రాధాన్యం..

ఏలూరు టూ టౌన్: విద్యకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. కోటదిబ్బ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ చేశారు. టీడీపీ నాయకురాలు తవ్వా అరుణకుమారి 60 మంది విద్యార్థులకు యూని ఫాం సమకూర్చారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు స్మార్ట్ వాచ్‌లు అందజేశారు.

శాలువలు సద్వినియోగం చేసిన ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దెందులూరు శాసనసభ్యుడు చింతమనేని ప్రభాకర్ పేద పిల్లలకు దుస్తులు అందించారు. అభిమానులు అందించిన శాలువాలను వృధాగా పడేయకుండా వాటిని దుస్తులుగా కుట్టించి, వసతిగృహాల్లో ఉండే బాలికలకు అందించే ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన గివ్ బ్యాక్ అనే కార్యక్రమం ద్వారా అభిమానులు ఇచ్చిన వాటిని తిరిగి పేద పిల్లలకు దుస్తులు కుట్టించి అందించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ గడచిన ఎన్నికల్లో కూటమి విజయం అనంతరం అభిమానులు వందలాదిగా వచ్చి తనకు శాలువాలు కప్పి అభినందించారన్నారు. అలా వచ్చి శాలువలతో తన ఇంట్లో ఒక గది నిండిపోయిందని, ఆ సమయంలో తమ కుమార్తె నవ్యశ్రీ వాటిని పేద పిల్లలకు దుస్తులుగా కుట్టించి ఇవ్వాలనే ఆలోచనతో చింతమనేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తొలి విడతగా ఈ రోజు 200 మందికి దుస్తులు అందించామని చెప్పారు. ప్రభాకర్ సతీమణి వెంకట రాధారాణి, పార్టీ నాయకులు తాతా సత్యనారాయణ, మేకా కనకరాజు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదలను ఆదుకోవ డమే కూటమి లక్ష్యమని చింతల పూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. సోమవారం లక్కవరంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన పలువురుకి మంజూరైన రూ.55 లక్షల 50 వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడుతూ రూ.90 లక్షలతో దేవులపల్లి- లక్కవరం రహదారి నిర్మిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఇటీవల జరిగిన ఎర్రకాలువ ప్రాజెక్టు కమిటీ ఎన్నికల్లో గెలుపొందిన ఛైర్మెన్ వందనపు రమణ, ఇతర నీటి సంఘాల అధ్యక్షులను ఆయన అభినందించారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బాలుడికి పరామర్శ

లింగపాలెం: నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి పెద్దకొడుకుగా అండగా ఉంటానని చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లింగపాలెం మండలం కొణిజర్ల గ్రామానికి చెందిన పొదిల ధనుష్ అనే బాలుడిని పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడి మెరుగైన చికిత్స, ఆపరేషన్‌కు అవసరమైన సదుపాయాలు అందేలా చూస్తానని బాలుడి కుటుంబసభ్యులకు హామీ ఇచ్చారు.

ఏజెన్సీ ప్రాంత భూ వివాదాలు పరిష్కరించాలి

పోలవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):: ఏజెన్సీ ప్రాంత భూ వివాదాలను రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం వింజరంలో బొరగం భూచంద్రం అధ్యక్షతన జరిగిన పార్టీ మండల సమావేశంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో ఎల్‌టీఆర్ 1/70 చట్టప్రకారం గిరిజనులకు చెందవలసిన భూములను గిరిజనేతరులు అన్యాక్రాంతంగా అనుభవిస్తున్నారన్నారు. ఏజెన్సీలో భూవివాదాలు తలెత్తినప్పుడు రెవెన్యూ అధికారులు ఇరు పక్షాల రికార్డులు టైటిల్ వెరిఫికేషన్ చేయాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కు పట్టాలు ఇవ్వాలని కోరారు. మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అనఘాష్టమి వ్రతాలు

జీలుగుమిల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కామయ్యపాలెం దత్తాశ్రమంలో సామూహిక అనఘాష్టమి వ్రతాలు జరిగాయి. మార్గశిర బహుళ అష్టమి పురస్కరించుకుని సోమవారం లోక కల్యాణార్థం గత పదేళ్లుగా ఈ ఆశ్రమంలో అనఘాష్టమి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అనఘా నంద భారతిస్వామి చెప్పారు. 108 మంది దంప తులతో శాస్త్రోక్తంగా వ్రతాలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధనలు, దత్తసాయి రథోత్సవం జరిగాయి. గణపతి సచ్చిదానంద స్వామిజీ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరు కార్పొరేషన్: స్థానిక


దొండపాడులోని శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో సోమవారం అర్చకులు ఘంటశాల రామకృష్ణ ఫణికుమార్ శర్మ భక్తులతో అనఘాష్టమి వ్రతాలను జరిపించారు.

కష్టార్జితం అడిగితే జైలుకు పంపారు

కొఠారు ఇంటి వద్ద కొనసాగుతున్న ఆందోళన

పెదవేగి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెముటోడ్సి చెరువులు తవ్వుకున్నామని, తీరా తినొచ్చే సరికి అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తమ కష్టార్జితా న్ని దోచుకున్నారని అదేమని అడిగినందుకు తమ ను జైలుకు పంపించారని లంక గ్రామస్థులు ఆరోపించారు. కొండలరావు పాలెంలోని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఇంటి దగ్గర లంక గ్రామస్తులు 12వ రోజు సోమవారం తమ ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా లంక గ్రామస్థులు మాట్లాడుతూ అబ్బయ్యచౌదరి చేపల చెరువుల కౌలు సొమ్ము ఇవ్వకుండా దౌర్జన్యాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. సొమ్ము ఇచ్చేవరకు కదిలేదని లేదని భీష్మించారు. కోమటిలంక, శ్రీపర్రు గ్రామస్తులకు మద్దతుగా కలకుర్రు, యాగనమిల్లి, తిమ్మారావుగూ డెం, మాదేపల్లి, జాలిపూడి గ్రామస్తులు నిరసనలో పాల్గొన్నారు. నేతల రవి, నంబూరి నాగరాజు, మండల రాజేంద్రప్రసాద్, ఘంటసాల కాసులు, మూర్తి, చింతపల్లి సాల్మన్ రాజు, సైదు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోచ్ సుబ్బారావు సేవలు ప్రశంసనీయం: మాగంటి

ఏలూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ అభివృద్ధికి జీకేవీ సుబ్బారావు (కాశీసుబ్బారావు) సేవలు ప్రశంసనీయమని ఏలూరు మాజీ ఎంపీ మాగంటిబాబు అన్నారు. సోమవారం నాడు జరిగిన ఫుట్‌బాల్ కోచ్ జి.కె.వి సుబ్బారావు సంతాప సభలో ఆయన మాట్లాడుతూ క్రీడారంగంలో యువతకు సుబ్బారావు మార్గదర్శకుడిగా నిలిచారని కొనియాడారు.



ఎంతోమందిని ఫుట్‌బాల్ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఫుట్‌బాల్ కోచ్‌లు, క్రీడాకారులు, సుబ్బారావు కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూవివాదం, ఆలయాలపై దాడుల ఘటనలు, ఆలయాల్లో ఉద్యోగాలు చేస్తున్న అన్యమతస్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలంటే హిందువుల ఆలయాల నిర్వహణను హిందు సమాజానికే అప్పగించాలనే నినాదంతో హైందవ శంఖారావం సభ నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జాతీయ కార్యదర్శి ఎక్కలి రాఘవులు అన్నారు. సోమవారం ఏలూరులో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు అంబికా కృష్ణ నివాసంలో ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందు సమాజం ఆకాంక్షలను వ్యక్తీకరించేందుకే జనవరి 5న హైందవ శంఖారావం పేరిట భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకుడు రాఘవులు

చింతలపూడి: జనవరి 5వ తేదీన గన్నవరం సమీపంలో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభను జయప్రదం చేయాలని మండల కమిటీ ఆధ్వర్యంలో వాహన ర్యాలీ నిర్వహించి సభ్యులు కరపత్రాలను పంపిణీ చేశారు.

పెదవేగి ఎంఈవో-1గా సబ్బితి

పెదవేగి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పెదవేగి ఎంఈవో -1గా సబ్బితి నరసింహమూర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. పెదపాడు ఎంఈవో- 1గా పనిచేస్తున్న ఆయన పెదవేగి ఎంఈవో-1గా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆయనను ఎంపీడీవో పి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకటరమణ, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, షఫీ, రమేష్, భూషణం సిబ్బంది అభినందించారు.

వైద్య ఖర్చులకు సాయం

టి.నరసాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ గౌడ్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మగాని బాలకృష్ణ ఆధ్వర్యంలో టి.నరసాపురం పంచాయతీకి చెందిన మిట్టగూడెం, ముత్యాలమ్మపేటలకు చెందిన నూతి చిన్న దుర్గారావు, తాతా నాగేశ్వరరావులకు వైద్య ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.15వేలను అందచేశారు. నిరుపేద గౌడ్‌లకు సేవా సమితి ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన తెలిపారు. టౌన్ ప్రసిడెంట్ మరీదు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎంవీఐ

పెదవేగి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని జానంపేట టెస్టింగ్ కార్యాలయ అధికారి, మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ బి.భీమారావు అన్నారు. జానంపేటలోని టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్ దగ్గర డ్రైవింగ్ లైసెన్సులకోసం వచ్చిన వాహనదారులకు సోమవారం డ్రైవింగ్ విధానం, ట్రాఫిక్ నిబంధనలుపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కార్లను నడిపేవారు సీట్‌బెల్టులను కచ్చితంగా ధరించాలని ఆయన చెప్పారు. ప్రతి వాహనానికి రహదారి పన్ను, ప్రమాద బీమావంటివి సకాలంలో చెల్లించాలని, మద్యం తాగి వాహనం నడిపితే శిక్ష కఠినంగా ఉంటుందని, జరిమానాతోపాటు జైలుశిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. సహాయ మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ నరేంద్రబాబు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కామవరపుకోట: స్థానిక భద్రకాళీ సహిత వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం అయ్యప్పస్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు చేశారు.

భక్తిశ్రద్ధలతో మహారుద్ర హోమం

నిడమర్రు: మందలపర్రులోని ఉమా నీలకంఠేశ్వర పంచాయత క్షేత్రంలో ఎన్ఆర్ఐ వేదపండితులు జ్యోతిష్య శాస్త్ర పరిశోధకులు అక్కిడప్రగడ రాఘవేంద్ర సాయిశర్మ ఆధ్వర్యంలో రుద్రహోమం భక్తిశ్రద్ధలతో జరుగుతోంది. సోమవారం రెండవ రోజు కూడా 33 సార్లు నమక హోమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలియజేశారు.



జనవాణిలో వినతుల స్వీకారం

ఉంగుటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జనసేన జనవాణిలో పాల్గొని వినతులు అందించిన వారి సమస్యలు ప్రణాళిక ప్రకారం పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. సోమవారం మంగళగిరిలో జనసేన జనవాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జనసేన అధికార ప్రతినిధి దాసరి కిరణ్, రాష్ట్ర కార్యదర్శి అంగ దుర్గా ప్రశాంతి, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



రైతు దినోత్సవం

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రైతులు అల్లూరి రామకృష్ణ, వామిశెట్టి హరిబాబు హాజరై విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులను ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గుల వితరణ

టి.నరసాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సేవా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, మాజీ సర్పంచ్ పెండ్యాల మల్లిబాబు తనయుడు అభిషేక్ బాబు తనయుడు బొర్రంపాలెంలో అభిషేక్ బాబు యూత్ ఆధ్వర్యంలో వృద్ధులకు 650 రగ్గులు సోమవారం పంపిణీ చేశారు.

మాలధారులకు రేడియం స్టిక్కర్లు

భీమడోలు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు సర్కిల్ పరిధిలో జాతీయ రహదారులపై పాదయాత్ర చేస్తూ ఆలయాలకు వెళ్ళే మాలధారణ స్వాములకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా వారి దుస్తులుపై భీమడోలు పోలీసుల ఆధ్వర్యంలో రేడియం స్టిక్కర్లను పంపిణీ చేశారు. ఇటీవల మాలధరించిన స్వాములు రహదారులపై నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రాత్రి సమయాల్లో వాహనాలకు స్వాములు కనపడే విధంగా రేడియం స్టిక్కర్లను పంపిణీ చేస్తున్నట్లు భీమడోలు సీఐ విల్సన్ తెలిపారు.

హ్యాండ్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఏలూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా ఎంబి ప్రసన్నలక్ష్మి, కార్యదర్శిగా కే శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా బి సుబ్రమణ్యం ఎంపికయ్యారు. రాష్ట్ర హాండ్‌బాల్ అసోసియేషన్ నుంచి ఎస్ గోపికృష్ణ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని శాప్ కోచ్ దుర్గారావు తదితరులు అభినందించారు.


ముదినేపల్లిలో మరమ్మతులకు నోచుకోని ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహ భవనం

సంక్షామ వసతి గృహాలు

» అరకొర వసతులు
» శిథిల భవనాలు

ముదినేపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి పెట్టడం లేదు. ముదినేపల్లిలో కళాశాల స్థాయి బాలుర, బాలికల వసతి గృహాల భవనాలు శిథిలం కావడం, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో మూతపడ్డాయి. బాలుర వసతి గృహం భవనం మరమ్మతులు చేయాల్సి ఉండగా, వాష్‌రూమ్స్ పనికి రాకుండా పోయాయి. గత ఏడాది విద్యార్థులు చేరకపోవడంతో వసతిగృహాన్ని మూసివేశారు. భవనం మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్ లేదంటూ జాప్యం చేస్తున్నారు. కళాశాల స్థాయి ఎస్సీ బాలికల వసతిగృహం కూడా మూతబడింది. వసతిగృహ భవనం శిథిలం కావడంతో విద్యార్థినులు చేరలేదు. ఈ ఏడాది ఏడుగురు విద్యార్థులు చేరినా వసతి గృహంలో ఉండే వీలులేక ప్రైవేట్ భవనంలో ఉంటున్నారు. పగలు వసతి గృహంలో భోజనం చేసి రాత్రి ప్రైవేట్ భవనంలో నిద్రించాల్సిన పరిస్థితి. బీసీ బాలుర వసతి గృహం వాష్‌రూమ్స్ మరమ్మతు చేయించాల్సి ఉంది. నీటి సమస్య పరిష్కారం కాలేదు.

వసతుల లేమి

చింతలపూడి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చింతలపూడిలో సాంఘిక సంక్షేమ హాస్టల్స్ అధ్వానంగా ఉన్నాయి. పట్టణంలోని శెట్టివారి గూడెం రోడ్డులోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో 125 మంది విద్యార్థులున్నారు. బాత్‌రూమ్ సదుపాయాలు సరిగా లేవు. తలుపులు ఊడిపోయి, గోడలకు పెచ్చులూడి అధ్వానంగా ఉన్నాయి. కొన్ని భవనాల్లో స్లాబ్ లీకేజీలు, పైపులైను లీకేజీలు, ప్రహరీ సమస్యలు ఉన్నాయి. హాస్టల్స్‌తో పాటు సంక్షేమ కార్యాలయం కూడా అధ్వానంగా ఉంది. పట్టణం లో బాలికల హాస్టల్‌లో కూడా సరైన సౌకర్యాలు లేవు. శింగగూడెంలో హాస్టల్ ఒకచోట, పాఠశాల మరొకచోట ఉండడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్ దాటాల్సిందే.

అరుగులపైనే భోజనం

జీలుగుమిల్లి: జీలుగుమిల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 247మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల అరుగులు, ఆవరణలో కూర్చుని భోజనం చేయాల్సిందే. కొందరు విద్యార్థులకు భోజన ప్లేట్‌లు, గ్లాసులు లేకపోవడంతో ఒక ప్లేట్‌లో ఇద్దరు విద్యార్థులు భోజనం చేస్తున్నారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో సరిపడిన గదులు, క్రీడా మైదానం లేదు. విద్యార్థులు ఉతికిన దుస్తులు ప్రహరీ, భవనం గోడపై ఆరబెడుతున్నారు. బాలుర వసతి గృహం వద్ద విద్యార్థులు ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే బట్టలు ఆరేస్తున్నారు. బర్రింకలపాడు ఏపీ గిరిజన గురుకుల పాఠశాల సిబ్బంది సకాలంలో విధులకు సకాలంలో హాజరుకావడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

పగిలిన మంచినీటి సరఫరా పైప్‌లు

240 గ్రామాలకు నిలిచిన మంచినీటి సరఫరా


మెయిన్ లైన్ మరమ్మతులకు గురై నీరు లీకవుతున్న దృశ్యం

పోలవరం డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి మంచినీటి సరఫరాకు గ్రహణం పట్టింది. ఇప్పటికే రెండు వారాలుగా పైపులైన్లు పగిలిపోయి పోలవరం మండలానికి నీటి సరఫరా నిలిచిన నేపథ్యంలో సత్యసాయి మంచినీటి కార్మికులు యడ్లగూడెం సమీపంలో మరమ్మతులు చేసి నీటి సరఫరా పునరుద్ధరించగా పాతపోలవరం వద్ద మరో రెండు చోట్ల పైపులైన్లు పగిలి మరమ్మతులకు గురయ్యాయి. దీంతో మళ్లీ నీటి సరఫరా నిలిపి మరమ్మతులకు ఉపక్రమించారు. తాజాగా సోమవారం కన్నాపురం అడ్డరోడ్డు వద్ద మెయిన్ పైపులైన్ల పైపులు పగిలిపోయి నీరు భారీ స్థాయిలో లీకవుతున్న నేపథ్యంలో సత్యసాయి కార్మికులు మంచినీటి సరఫరా పూర్తిగా నిలిపివేశారు. పైపులు పగిలిన ప్రాంతంలో మరమ్మతులు చేయడానికి నీటిని మోటార్లతో తోడే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మంచి నీటి సరఫరా నిలిపివేయడంతో పోలవరం, కొవ్వూరు, గోపాలపురం, చింతలపూడి నియోజక వర్గాల్లో 17 మండలాల్లో సుమారు 240 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో గ్రామాల ప్రజలు మంచినీటి అవసరాలకు ఇబ్బందులకు గురవుతు న్నారు. అధికారులు స్పందించి నాణ్యమైన పైపులైన్లు వేసి మరమ్మతులు చేసి మంచినీటి సరఫరా పునరుద్ధరించాలని కోరుతున్నారు.

కష్టార్జితం అడిగితే జైలుకు పంపారు

కొఠారు ఇంటి వద్ద కొనసాగుతున్న ఆందోళన

పెదవేగి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెమటోడ్చి చెరువులు తవ్వుకున్నామని, తీరా తినొచ్చేసరికి అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తమ కష్టార్జితాన్ని దోచుకున్నారని అదేమని అడిగినందుకు తమను జైలుకు పంపించారని లంక గ్రామస్థులు ఆరోపించారు. కొండలరావుపాలెంలోని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఇంటి దగ్గర లంక గ్రామస్తులు 12వ రోజు సోమవారం ఆందోళన కొనసాగించారు. లంక గ్రామస్థులు మాట్లాడుతూ అబ్బయ్యచౌదరి చేపల చెరువుల కౌలు సొమ్ము ఇవ్వకుండా దౌర్జన్యాలకు పాల్పడ్డారన్నారు. సొమ్ము ఇచ్చేవరకు కదిలేదని లేదని భీష్మించారు. కోమటిలంక, శ్రీపర్రు గ్రామస్తులకు మద్దతుగా కలకుర్రు, యాగనమిల్లి, తిమ్మారావుగూడెం, మాదేపల్లి, జాలిపూడి గ్రామస్తులు నిరసనలో పాల్గొన్నారు. నేతల రవి, నంబూరి నాగరాజు, మండల రాజేంద్రప్రసాద్, ఘంటసాల కానులు, మూర్తి, చింతపల్లి సాల్మన్ రాజు, సైదు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మంచు ముసుగులో ప్రధాన గోపురం


హిమవర్షంలో గజలక్ష్మి మార్నింగ్ వాక్

శ్రీవారు కొలువైన శేషాచలం కొండపై మంచు ముసుగులా పరుచుకుంది. భానుడి లేలేత కిరణాలను పొగమంచు తెరలు కమ్మేశాయి. ఇక మేలుకోవయ్యా శ్రీనివాసా.. అంటూ ఆలయ అర్చకులు స్వామి వారిని మేల్కొలిపి అర్చనలు చేశారు. మంచు పరదాలతో క్షేత్ర పరిసరాలు కనిపించలేదు. శేషాచల కొండపై రహదారులు సైతం సరిగా కనిపించక భక్తులు ఇబ్బందులు పడ్డారు. వాహనాల లైట్ల ఆధారంగా వారు ఆలయానికి చేరుకున్నారు. శ్రీవారి ఆలయ రాజగోపురాల సముదాయం, ఘాట్ రోడ్డు, శివాలయం, ఇలా శేషాచల ప్రాంతమంతా మంచులో చిక్కుకుంది. మంచుతెరలను చీల్చుకుని భానుడు వచ్చే సుందర దృశ్యాలను వీక్షించిన భక్తులు పరవశించారు. **- ద్వారకాతిరుమల**



రైతుల సంక్షేమం కోసం పనిచేయాలి


ముసునూరులో రైతు దినోత్సవ దృశ్యం

ముసునూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వాలు పని చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు అన్నారు. ముసునూరు రావిచెట్టు సెంటర్‌లో జాతీయ రైతు దినోత్సవాన్ని రైతులు, రైతు సంఘం నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతదేశపటంలో రైతు ధాన్యాన్ని ఎడ్లబండిపై తీసుకువెళుతున్న పటానికి నాయకులు పూలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించి, సమస్యలను తెలుసుకున్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న నూజివీడు సబ్‌కలెక్టర్

22 అర్జీలు అందజేత

నూజివీడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 22 అర్జీలు దాఖలైనట్లు నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా దాఖలైన అర్జీల పరిష్కారానికి ఆయాశాఖల అధికారులు నిర్ణీత కాలంలోపు చర్యలు తీసుకోవాలన్నారు.

అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసన

ముసునూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచేలా హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యాలను సోమవారం సీపీఎం నాయకులు ఖండించారు. చింతలవల్లి అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం, వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ కేంద్ర మంత్రి హోదాలో ఉన్న వ్యక్తి అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలు అందరూ ఖండించాలన్నారు.

పాత నేరస్థులకు కౌన్సెలింగ్

చాట్రాయి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపులలో మద్యం అక్రమ అమ్మకాలు చేస్తూ గతంలో పట్టుబడిన పాత నేరస్తులు 9 మందిని ఎక్సైజ్ పోలీసులు సోమవారం తహసీల్దార్ ప్రశాంతి ఎదుట హాజరుపర్చారు. చట్ట వ్యతిరేకమైన పనులు చేస్తూ చట్టం దృష్టిలో, సమాజం దృష్టిలో చెడ్డవారిగా మిగిలిపోవద్దని, మంచి వృత్తులు చేసుకుంటూ గౌరవప్రదంగా జీవించాలని నిందితులకు తహసీల్దార్ కౌన్సెలింగ్ ఇచ్చారు.

సాగు భూములకు పట్టాలివ్వాలని వినతి


ఆరుగొలనుపేటలో సాగుదారుల ప్రదర్శన

చాట్రాయి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తరతరాలుగా తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చెయ్యాలని సోమవారం ఆరుగొలనుపేటలో పేద సాగుదారులు ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనకు నాయకత్వం వహించిన సీపీఐ (ఎంఎల్)లిబరేషన్ నాయకులు దుర్గం పుల్లారావు, చాట్ల బాబూరావు, వేముల బక్కయ్య మాట్లాడుతూ సదరు భూముల్లో 272 మంది పేదలు 600 ఎకరాలు సాగు చేసుకుంటూ జీవనం చేస్తున్నారని అన్నారు. 2019లో పేద సాగుదారులందరూ విజయవాడ ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి వద్ద క్లైములు చేయగా ఇప్పటి వరకు స్పందించకపోవటం శోచనీయమన్నారు. అనంతరం రెవెన్యూ సదస్సులో సాగుదారులు అర్జీలు సమర్పించారు.

కోలాహలంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



ముదినేపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ముదినేపల్లిలోని ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో కోలాహలంగా జరిగాయి. హైస్కూలు కరస్పాండెంట్ మదన్ కిషోర్, ప్రిన్సిపాల్ కొత్తూరు వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులు వివిధ వేషధారణలతో క్రిస్మస్ ప్రదర్శనలు నిర్వహించారు. క్రిస్మస్ తాత వేషధారణలో ఓ విద్యార్థి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా ఏసు సందేశాలను గేయాలుగా ఆలపించారు. స్కూలు టీచర్లు నాగలక్ష్మి, కావ్య ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

రీ సర్వేపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న రెవిన్యూ అధికారులు, సిబ్బంది

ముసునూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిగూడెం గ్రామంలో చేపట్టబోయే రీ సర్వేపై సోమవారం ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ కె.వి రమణ మాట్లాడుతూ ఈ గ్రామంలో రెండురోజుల నుంచి రీసర్వే జరుగుతుందని, ప్రస్తుతం గ్రామ సరిహద్దుల సర్వే జరుగుతుందని, రైతులందరూ ఈ సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పులిబక్క లక్ష్మీ సత్యనారాయణ, మండల సర్వేయర్ సురేష్‌బాబు, గ్రామ టీడీపీ అధ్యక్షులు బర్మా శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఆరుగొలనుపేటలో అర్జీలు తీసుకుంటున్న డీటీ

రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

చాట్రాయి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆరుగొలనుపేట,కృష్ణారావుపాలెం గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. వివిధ భూ సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గీత, సర్పంచ్ అప్పిరెడ్డి, ఎంపీటీసీ కృష్ణ, టీడీపీ నాయకులు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, పానుగళ్ళ కోటేశ్వరరావు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎనిమిది అర్జీల స్వీకరణ

ముసునూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిల్లబోయినపల్లిలో ఆర్ఐ దీపిక అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ భూసమస్యలపై 8 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బి.ఎ సత్యనారాయణ, వీఆర్వో నవీన్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వైష్ణవి సహాయం

ముదినేపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వి.రావిగుంట గ్రామంలో కిడ్నీ వ్యాధితో సోమవారం మరణించిన బొడ్డు శ్రీధర్ అంత్యక్రియల నిర్వహణకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ఆర్థిక సహాయం అందజేశారు. మరణించిన తన కుమారుడి అంత్యక్రియలకు ఆర్థిక స్థామత లేని శ్రీధర్ తల్లి నాంచారమ్మ నిస్సహాయస్థితిని తెలుసుకున్న వైష్ణవి రూ.5 వేల నగదు సహాయాన్ని తన తండ్రి డాక్టర్ మనోజ్ ద్వారా అందజేశారు.

కోడి పందేలపై దాడి

నూజివీడు టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థనగర్ గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్నా రన్న సమాచారం మేరకు ఆదివారం రాత్రి నూజివీడు రూరల్ ఎస్సై లక్ష్మణ్‌బాబు, తమ సిబ్బందితో దాడిచేసి పది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కోడిపుంజు, రూ.4,300 నగదు స్వాధీన పరుచుకున్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

నూజివీడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో నూజివీడు త్రివిధ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు కెరీర్‌గైడెన్స్ పై అవగాహన కల్పించారు. గుంటూరుకు చెందిన సైకాలజీ నిపుణులు ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చే దిశగా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు.

భూ సమస్యలపై ప్రత్యేక చర్యలు

ముదినేపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భూముల సమస్యలకు సంబంధించిన అర్జీల పరిష్కారం పట్ల రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటారని ముదినేపల్లి మండల ప్రత్యేకాధికారి పి.శ్రీనివాస్ తెలిపారు. దాకరం, కోడూరు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ సుభానీ, దేవదాయ శాఖ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, దాకరం సర్పంచ్ జాస్తి రాజా, వీఆర్వోలు కరీం, సంజీవరావు పాల్గొన్నారు.

కొచ్చెర్లలో 27 అర్జీలు

కలిదిండి : కొచ్చెర్లలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు భూ సమస్యలపై 27 అర్జీలు వచ్చా యని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. సర్పంచ్ ఆల రాము, ఆర్ఐ శ్యామల, సర్వేయర్ షమీ, వీఆర్వో గంగాధర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.


కొచ్చెర్ల గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

మధ్యాహ్న భోజనం తనిఖీ

కలిదిండి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే మధ్యాహ్న భోజనం పథకంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో నరేష్ కుమార్ ఏజన్సీ నిర్వాహకులను హెచ్చరించారు. తాడినాడ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

మద్యం విక్రేత అరెస్టు

కలిదిండి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కలిదిండి పంచాయతీ కార్యాలయం సమీపంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న మోషేను అరెస్టు చేసి 51 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. బెల్టు షాపులు ఏర్పాటు చేసి అనధికారికంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


మండవల్లిలో విద్యార్థులకు టెస్ట్‌పేపర్స్ అందజేస్తున్న దృశ్యం

పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ పుస్తకాలు

మండవల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండవల్లి జడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థి, అయ్యవారి రుద్రవరం దళితవాడ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చిరిగిరి పిచ్చోడు ఆర్థిక సాయంతో ఎంఈవో దొడ్డా రామారావు 160 మంది పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్స్ పుస్తకాలను పంపిణీ చేశారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన రూ.14 వేలు విలువ చేసే మోడల్ టెస్ట్ పేపర్స్ మండవల్లి హైస్కూల్‌లో 140 మందికి, ఇంగిలి పాకలంక హైస్కూల్‌లో 20 మందికి అందజేశారు. హెచ్ఎం ప్రసాద్, జిల్లా యూటీఎఫ్ జనరల్ సెక్రటరీ రవికుమార్, యూటీఎఫ్ సీనియర్ నాయకులు రమేశ్, జిల్లా కార్యదర్శి రవిశంకర్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన హిందూ ధర్మ సమితి సభ్యులు

మండవల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండవల్లి శివాలయంలో హిందూ ధర్మ సమితి సభ్యులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని పలురకాల పండ్ల మొక్కలను సోమవారం నాటారు. గ్రామంలోని పలు ఆలయాల్లో హిందూ ధర్మసమితి సభ్యులు మొక్కలు నాటారు. ఆలయ ఈవో కె.దివ్యశ్రీ, హింధూ ధర్మసమితి సభ్యులు పాల్గొన్నారు.

మోకాసాకలవపూడి సర్పంచ్ శ్యామలత మృతి


శ్యామలత (ఫైల్)

మండవల్లి, డిసెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): మోకాసకలవ పూడి గ్రామసర్పంచ్ బొప్పన విజయ శ్యామ లత (55) సోమవారం అనారోగ్యం కారణంగా మృతి చెందారు. 2021 ఫిబ్రవరి 13న సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. గ్రామంలోని అభివృద్ధి కార్యక్రమాల్లో తనదైన శైలిలో ముద్రవేశారు. శ్యామలత భర్త బొప్పన జగదీష్ టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. పలువురు ప్రముఖులు, టీడీపీ శ్రేణులు శ్యామలత మృతికి సంతాపం తెలిపారు.

జాతీయ రహదారి పనులు ప్రారంభం


శింగాపురంలో జాతీయ రహదారి అభివృద్ధి పనులు జరుగుతున్న దృశ్యం

కైకలూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పామర్రు-దిగమర్రు 165 జాతీయ రహదారి విస్తరణ పనులు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ జోక్యంతో సోమవారం ప్రారంభమయ్యాయి. గత పది నెలలుగా కైకలూరు మండలం గోనెపాడు నుంచి భుజబలపట్నం వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు కొంతమేర నిర్వహించి కాంట్రాక్టర్ వదిలివేశాడు. దీంతో రహదారిపైన దుమ్ముధూళితో ఆయా గ్రామాల ప్రజలతో పాటు విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. దీంతో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ జాతీయ రహదారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీంతో కాంట్రాక్టర్ పనులను ప్రారంభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

• స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతులు



కలిదిండి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అధ్వానంగా ఉన్న మట్టగుంట - పెదలంక ప్రధాన రహదారికి కూటమి నాయకులు, రైతులు సోమ వారం స్వచ్ఛందంగా మరమ్మతులు ప్రారంభిం చారు. రహదారిపై పడిన గోతులను ఎక్స్‌కవేట ర్‌తో చదును చేసి కంకరతో పూడ్చుతున్నారు. కలిదిండి డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, టీడీపీ నాయకులు దున్న భోగేశ్వర రావు, అక్కల బోసు, దుగ్గిరాల చంద్రశేఖర్ , ముద్దం వీరాస్వామి, వెంకన్నబాబు పాల్గొన్నారు.


ముదినేపల్లిలో విద్యుద్దీపాలంకరణతో ఆర్‌సీఎం చర్చి

క్రిస్మస్ వెలుగులు

ముదినేపల్లి/ కైకలూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు గ్రామాగ్రామాన చర్చిలు ముస్తాబయ్యాయి. ఇప్పటికే చర్చీలకు విద్యుదీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ముదినేపల్లిలోని ఆర్‌సీఎం చర్చి క్రిస్మస్ వేడు కలకు విద్యుత్ జిలుగులతో ముస్తాబైంది. చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన క్రీస్తు జనానికి సంబంధించిన చావిడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అన్ని ఉప ఆలయాలను తీర్చిదిద్దారు. చర్చి ఫాదర్ కె.మరియ దాసు ఆధ్వ ర్యంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కైకలూరు ఆర్‌సీఎం చర్చి, ఆటపాక సీబీసీఎన్‌సీ చర్చి, భుజబలపట్నం, పల్లెవాడ, రాచపట్నం శివారు చింతలచెరువు, వరహాపట్నం, దొడ్డిపట్ల తదితర గ్రామాల్లో చర్చిల్లో క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. మరోవైపు మార్కెట్లో సందడి నెలకొంది. స్టార్లు, శాంతాక్లాజ్‌ల కొనుగోళ్ళతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.


కైకలూరులో ఆర్‌సీఎం చర్చి